
విశాల భారతి
తెలుగు దినపత్రిక
18-03-2026
www.vishalabharati.com
epaper.vishalabharati.com
బుధవారం, హైదరాబాద్
సంపుటి:4 సంచిక: 73

# రూ.18 వేల కోట్ల కుంభకోణం

- రూ.18,000 కోట్ల భారీ కుంభకోణం జరుగుతోంది: హరీష్ రావు
- ఆర్ అండ్ బీలో, పంచాయతీ రాజ్‌లో వేల కోట్ల అవకతవకలు
- గతంలో వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు 10శాతం అడ్వాన్స్‌లు
- కాంట్రాక్టర్ల సిండికేట్ ద్వారా 20-30శాతం అధిక ధరలకు టెండర్లు
- సీఓటీ అనుమతి లేకుండా డిపార్ట్‌మెంట్ స్థాయిలోనే ఫైళ్లు క్లియర్ చేసే కుట్ర
- ఈ కమిషన్ల డబ్బును ఇతర రాష్ట్రాల ఎన్నికల ఖర్చు కోసం మళ్లిస్తున్నారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో రోడ్ల నిర్మాణాల పేరుతో అంతులేని అవినీతికి తెరలేపారని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో చేపట్టే రోడ్ల పనుల్లో సుమారు రూ.18 వేల కోట్ల భారీ కుంభకోణం చోటుచేసుకుందని ఆయన గణాంకాలతో సహా వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేని సమయంలో ఇంత భారీ మొత్తంలో పనులను కేటాయించడం మిగతా 2లో..

# అసెంబ్లీలో రచ్చ రచ్చ..!


## గవర్నర్ ప్రసంగంపై చర్చలో కేటీఆర్ వర్సెస్ మంత్రులు

పెన్షన్లు, నిరుద్యోగ భృతి ఎగ్గొట్టారని మాజీ మంత్రి ధ్వజం





తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, ప్రజలను మోసం చేస్తోందని ఆయన ఆరోపించారు. "పెన్షన్లు పెంచనందుకు ధన్యవాదాలు చెప్పాలా? నిరుద్యోగ భృతి ఇవ్వనందుకు చెప్పాలా? లేక ఉద్యోగులను మోసం చేసినందుకు చెప్పాలా?" అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం గడిచిన కాలంలో ప్రజలకు ఏమీ చేయలేదని, కేవలం మాటలకే పరిమితమైందని ఆయన విమర్శించారు. రైతుల రుణమాఫీ విషయంలోనూ ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తోందని, నిరుద్యోగులను నట్టేట ముంచిందని కేటీఆర్ మండిపడ్డారు. కేటీఆర్ విమర్శలను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయించామని గుర్తు చేశారు. యంగ్ ఇండియా స్కూల్స్ కడుతున్నందుకు, కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, ఆ అప్పులకు ఇప్పుడు తాము వడ్డీలు కడుతున్నామని, కేటీఆర్ ఓపికతో ఉంటే అసలు నిజాలు తెలుస్తాయని హితువు పలికారు.



- ఉచిత బస్సు, 200 యూనిట్ల విద్యుత్ ఇచ్చామని బదులు
- గత ప్రభుత్వ అప్పులకు వడ్డీలు కడుతున్నామని భట్టి విక్రమార్క ఫైర్
- కాంగ్రెస్ సర్కార్‌ది '420' పాలన అంటూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు
- నిధుల కోసమే ఢిల్లీకి వెళ్తున్నామని స్పష్టం చేసిన శ్రీధర్ బాబు

02







# డ్రగ్స్ కేసులోకి 'సిట్'

- మొయినాబాద్ డ్రగ్స్ కేసు దర్యాప్తునకు ప్రత్యేక బృందం
- మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డిపై ఏ1గా కేసు నమోదు
- పోలీసులపైకి కాల్పులు జరిపిన నమిత్ శర్మ
- రోహిత్ రెడ్డి ఆదేశాలే కారణమన్న అభియోగాలు
- ఎంపీ పుట్టాతో సహ ఆరుగురికి డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్
- రోహిత్ రెడ్డితో పాటు ముగ్గురికి 14 రోజుల రిమాండ్
- ఫామ్ హౌస్‌లో జరిగిన విందులో బయటపడ్డ డ్రగ్స్ వినియోగం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఒక ఫామ్ హౌస్ శనివారం రాత్రి మత్తులో మునిగిపోయిందన్న పక్కా సమాచారంతో ఈగల్ పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఈ ఫామ్ హౌస్‌లో నిర్వహించిన మిగతా 2లో..





03

## ఇరాన్ భద్రతా చీఫ్ అలీ లారిజానీ హతం

- ఇజ్రాయెల్ దాడుల్లో అలీ లారిజానీ మరణించినట్లు కథనాలు
- అత్యంత కీలకమైన నేతను కోల్పోవడం ఆ దేశానికి కోలుకోలేని దెబ్బ
- సమాచారం ఇస్తే రూ.83 కోట్ల బహుమతి ప్రకటించిన కొద్దిసేపటికే
- ఇరాన్ నిరసనలు ఏఐ సృష్టించినవన్న ట్రంప్ వ్యాఖ్యలపై ఆగ్రహం

# కాబుల్‌లో మారణహోమం

- ఆసుపత్రిపై వైమానిక దాడి.. 400 మంది మృతి
- 250 మందికి పైగా రోగులు, సిబ్బందికి తీవ్ర గాయాలు
- దాడికి పాకిస్థానే కారణమన్న అఫ్గాన్ ప్రభుత్వం
- ఉగ్రవాద స్థావరాలనే లక్ష్యం చేసుకున్నామని వెల్లడి
- ఐరాస విచారణ జరపాలని డిమాండ్
- పౌర ప్రాంతాలపై దాడులు నిలిపివేయాలని ఐరాస విజ్ఞప్తి

04





05

## భర్త చేతిలో యూట్యూబర్ దారుణ హత్య

- గర్భిణి అని చూడకుండా భార్యపై భర్త కత్తితో కిరాతక దాడి
- యూట్యూబర్ వైష్ణవి మృతితో మాదాపూర్‌లో పెల్లుబికిన ఆగ్రహం
- ప్రేమ వివాహం చేసుకున్న రెండేళ్లకే నూరేళ్ల జీవితం బలి
- అత్తింటి వేధింపులే కారణమని బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు
- పరారీలో ఉన్న నిందితుడు హరిబాబు కోసం పోలీసుల గాలింపు

## పీసీసీ పీఠంపై కోమటిరెడ్డి హాట్ కామెంట్స్!

- టీపీసీసీ చీఫ్ రేసులోకి జగ్గారెడ్డి పేరును తెచ్చిన మంత్రి
- జగ్గారెడ్డి సారథ్యంలో 100 సీట్లు వస్తాయని వ్యాఖ్య
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ తీరుపై మాజీ మంత్రి తీవ్ర అసంతృప్తి
- 40 ఏళ్ల అనుబంధాన్ని వదులుకునేందుకు సిద్ధమైన జీవన్‌రెడ్డి
- కార్యాలయం నుంచి ఫ్లెక్సీల తొలగింపు.. భవిష్యత్ కార్యాచరణపై సందిగ్ధం
- బీఆర్ఎస్ నేతల చేరికతో కాంగ్రెస్ సీనియర్లలో పెరుగుతున్న అసహనం

03





## కాంగ్రెస్‌లో ఎందుకు ఉండాలి

- సంజయ్ అసలు ఏ పార్టీలో ఉన్నారో ఆయనకే తెలియదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయి ఉండి కాంగ్రెస్ వ్యవహారాల్లో జోక్యం
- నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకునేలా సంజయ్ ప్రవర్తన
- గత 20 నెలలుగా నియోజకవర్గానికి సంజయ్ చేసింది శూన్యం
- పార్టీ మార్పుపై ఏ నిర్ణయం తీసుకున్నా చట్టబద్ధంగానే ఉంటుంది

03

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలో పనిచేయుటకు అనుభవం ఆసక్తి ఉన్న జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు,మండల విలేకరులు కావలెను.
కొత్తవారికికూడా అవకాశం కలదు..
పనిచేయు మండలాలు:
ఖమ్మం జిల్లా : జిల్లా స్టాఫర్, క్రైమ్,ఖమ్మం రూరల్,మండలాలు తిరుమలయపాలెం ,వైరా, కొణిజర్ల, ముదిగొండ, రఘునాథపాలెం, ఎర్రుపాలెం,మధిర, తల్లాడ, బోనకల్లు, చింతకాని, కామేపల్లి, కల్లూరు పెనుబల్లి, వేంసూరు,ఏన్కూరు మండల విలేకర్లు కావలెను.
కొత్తగూడెం జిల్లాలో: కొత్తగూడెం,కొత్తగూడెం టౌన్, సింగరేణి, క్రైమ్, జూలూరుపాడు, సుజాత నగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి,టేకులపల్లి,ఇల్లందు చంద్రుగొండ,అన్నపూరెడ్డిపల్లి, ములకలపల్లి, దుమ్ముగూడెం, చర్ల, పినపాక.
పైన తెలిపిన మండలాల్లో నిజాన్ని నిర్భయంగా రాసే దమ్మున్న ఆసక్తి గల విలేకర్లు కావలెను.
సంప్రదించవలసిన నెంబర్:
93989 08071
వివరాల కోసం: epaper.vishalabharati.com

# బీజేపీ కార్యకర్తలపై వరుస దాడులు

- డీజీపీ శివధర్ రెడ్డిని కలిసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు
- బీజేపీ కార్యకర్తలపై వరుస దాడులను అరికట్టాలని వినతిపత్రం అందజేత
- మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పెరిగిన రాజకీయ వేధింపులపై ఆగ్రహం
- పోలీసులే స్వయంగా భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపణ
- హోంమంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి వైఫల్యంపై ఘాటు విమర్శలు
- న్యాయం జరగకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని బీజేపీ హెచ్చరిక

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ గడ్డపై రాజకీయ సెగలు మున్సిపల్ ఎన్నికల వేళ మరింత రాజుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ శ్రేణులే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మంగళవారం డీజీపీ శివధర్ రెడ్డిని కలిశారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, పోలీసు యంత్రాంగం అనుసరిస్తున్న ఏకపక్ష వైఖరిని ఆయన డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కూడా కాలరాస్తున్నారని, అధికార పక్షానికి అనుకూలంగా ఖాకీలు వ్యవహరించడం శోచనీయమని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగినప్పటి నుంచి బీజేపీకి ఆదరణ పెరుగుతోందని, దీనిని భరించలేకనే అధికార కాంగ్రెస్ పార్టీ కక్షపూరిత రాజకీయాలకు తెరలేపిందని రాంచందర్‌రావు ధ్వజమెత్తారు. బీజేపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం, నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం వంటి చర్యలు నిస్సిగ్గుగా సాగుతున్నాయని మండిపడ్డారు. భయపడకుండా ఎన్నికల బరిలో నిలిచిన కార్యకర్తలను శారీరకంగా హింసించడం ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారని ఆయన విమర్శించారు. కేవలం రాజకీయ ప్రత్యర్థులు దాడులు చేయడం ఒకెత్తయితే, శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే స్వయంగా దాడులకు దిగడం అత్యంత దారుణమని రాంచందర్‌రావు పేర్కొన్నారు. గతంలో నల్గొండ ఎస్పీ తీరు, తాజాగా పరిగి సీఐ బీజేపీ కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడిన ఘటనలను ఆయన డీజీపీకి వివరించారు. యూనిఫామ్ వేసుకున్న అధికారులు ఒక పార్టీ కార్యకర్తల్లా ప్రవర్తించడం వ్యవస్థకే ప్రమాదకరమని హెచ్చరించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడంపై తక్షణమే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోం శాఖను తన వద్దే ఉంచుకుని కూడా రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను పట్టించుకోవడం లేదని బీజేపీ నేత ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నా సీఎం మౌనం వహించడం వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు. హోంమంత్రిగా విఫలమైన రేవంత్ రెడ్డి, తన పార్టీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయడంలో పూర్తిగా చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని, విపక్షాల గొంతు నొక్కడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

పోలీసు శాఖ తీరుపై రాంచందర్‌రావు ఘాటు వ్యాఖ్యలు చేస్తూ, విభాగమంతా కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగంలా మారిపోయిందని విమర్శించారు. సామాన్య ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు, కేవలం అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో మెలుగుతూ విపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. చట్టాన్ని గౌరవించే అధికారులను పక్కనపెట్టి, అధికార పక్షానికి కొమ్ముకాసే వారికే కీలక పోస్టింగులు ఇస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది వ్యవస్థలను నిర్వీర్యం చేయడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

బీజేపీ నాయకత్వం అందజేసిన ఫిర్యాదుపై డీజీపీ శివధర్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు రాంచందర్‌రావు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో జరిగిన ఘటనలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని డీజీపీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. పోలీసు అధికారుల అతివాదంపై ఆధారాలతో సహా సమర్పించామని, దీనిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన కోరారు. డీజీపీ ఇచ్చిన హామీ నెరవేరుతుందని ఆశిస్తున్నామని, లేనిపక్షంలో న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో హింసాత్మక రాజకీయాలు పెరిగాయని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ శ్రేణులను టార్గెట్ చేస్తున్నారని రాంచందర్‌రావు వివరించారు. అభివృద్ధిని కాంక్షించే ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతుండటంతో, ఓటమి భయంతో కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. దాడులు చేసినంత మాత్రాన బీజేపీ కార్యకర్తలు భయపడరని, రెట్టింపు ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్ అరాచకాలకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ప్రభుత్వ వేధింపులు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన కాంగ్రెస్ నాయకత్వానికి హెచ్చరికలు జారీ చేశారు. ప్రతి దాడులకు బీజేపీ పూనుకోలేదని, కానీ తమ సహనాన్ని పరీక్షించవద్దని కోరారు. ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేస్తామని, అవసరమైతే ఢిల్లీ స్థాయిలో కూడా ఫిర్యాదు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని పరిస్థితులను గవర్నర్ దృష్టికి కూడా తీసుకెళ్తామని, కేంద్ర హోం శాఖకు ప్రత్యేక నివేదిక అందజేస్తామని ఆయన ఈ సందర్భంగా మీడియాకు వివరించారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు కాపాడబడాలంటే పోలీస్ వ్యవస్థ నిష్పక్షపాతంగా ఉండాలని రాంచందర్‌రావు ఆకాంక్షించారు. ఖాకీ చొక్కా మాటున రాజకీయాలు చేసే అధికారులను చరిత్ర క్షమించదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని గుర్తు చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ విశ్రమించదని, కార్యకర్తలకు అండగా పార్టీ అగ్ర నాయకత్వం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏ ఒక్క కార్యకర్తపై చేయి పడినా ఊరుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టమైన సందేశాన్ని పంపారు.

మొత్తానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డీజీపీని కలవడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, పోలీసుల అరాచకాలకు ఫుల్‌స్టాప్ పడుతుందని కమలనాథులు భావిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో, పోలీస్ శాఖ ఎలాంటి చర్యలు చేపడుతుందో వేచి చూడాలి. రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కుతున్న తరుణంలో, శాంతిభద్రతల పరిరక్షణే ఇప్పుడు అందరి ముందున్న ప్రధాన సవాలుగా కనిపిస్తోంది.


## ప్రమాదకరంగా బడి పిల్లల ప్రయాణం

**ఆర్కే నగర్‌లో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలి**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని ఆర్కే నగర్‌లో ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో చిన్న వయస్సు పిల్లలు ప్రతిరోజు ఆటోలు, బస్సుల్లో ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సి వస్తోందని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సిపిఐ ఆర్కే నగర్ శాఖ ఆధ్వర్యంలో శాఖ కార్యదర్శి భైరగోని రాజు గౌడ్ నేతృత్వంలో మండల విద్యాశాఖ అధికారి జగదీష్‌కు వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా హరిసింగ్ నాయక్ మాట్లాడుతూ.. దాదాపు ఇరవై ఏళ్ల క్రితం ఏర్పడిన ఆర్కే నగర్‌లో ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాల లేకపోవడం విచారకరమన్నారు. ప్రస్తుతం ఆర్కే నగర్‌లో ఒక పాఠశాలకు సరిపడేంత మంది విద్యార్థులు ఉన్నప్పటికీ, వారు అన్నారం, మర్రిపల్లి, నాగోల్ ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. చిన్నపిల్లలు ఆటోలు, ఆర్టీసీ బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణం చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రభుత్వం ఇతర రంగాలతో పోలిస్తే విద్యకు కేటాయించే వ్యయం పెద్దది కాదని పేర్కొంటూ, అత్యంత నిరుపేదలు నివసిస్తున్న ఆర్కే నగర్ ప్రజల రెండు దశాబ్దాల కోరికను దృష్టిలో ఉంచుకుని కనీసం వచ్చే విద్యాసంవత్సరం నుంచైనా ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఆర్కే నగర్ శాఖ సహాయ కార్యదర్శి పేరాల గోపి తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఎంటీ నగర్ పెద్ద చెరువుకు మహర్దశ

**రూ.30 కోట్లతో సుందరీకరణ పనులు సిద్ధం**



**నాచారం, విశాలభారతి:** హెచ్‌ఎంటీ నగర్ పెద్ద చెరువుకు మహర్దశ రూ.30 కోట్లతో సుందరీకరణ పనులు సిద్ధం ఉప్పల్ నియోజకవర్గందశాబ్దాల నిరీక్షణకు తెరపడనుంది. నాచారం పరిధిలోని హెచ్‌ఎంటీ నగర్ పెద్ద చెరువు అభివృద్ధికి అడుగులు పడ్డాయి. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవతో ఈ చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు డిజైన్లు సిద్ధమయ్యాయి. క్షేత్రస్థాయిలో పరిశీలన సోమవారం ఎమ్మెల్యే విమోస్ ఏజెన్సీ ప్రతినిధులు యూసుఫ్, శ్రీనాథ్‌లతో కలిసి చెరువు పరిసరాలను స్వయంగా పరిశీలించారు. సుమారు రూ.30 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న ఈ పనుల డిజైనింగ్‌పై అధికారులకు కీలక సూచనలు చేశారు. దోమల సమస్యపై యుద్ధం ప్రస్తుతం చెరువులో గుర్రపుడెక్క విపరీతంగా పెరగడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణ చర్యలు: చెరువులోని నీటిని త్వరగా ఖాళీ చేయాలని అధికారులను ఆదేశించారు. గుర్రపుడెక్కను తొలగించి, దోమల సమస్య నుండి ప్రజలకు విముక్తి కలిగించాలని స్పష్టం చేశారు. గత 3040 ఏళ్లుగా ఏ ప్రజాప్రతినిధి పట్టించుకోని ఈ సమస్యను,ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నిధులు మంజూరు చేయించి పరిష్కరించడం అభినందనీయం. హెచ్‌ఎంటీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రగ్స్ కేసులోకి 'సిట్'

**మొదటిపేజీ తరువాయి**






పార్టీలో పెద్ద ఎత్తున డ్రగ్స్ వినియోగం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అక్కడున్న 11 మందిని అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షలు నిర్వహించగా, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ , పైలట్ రోహిత్ రెడ్డి సహా మొత్తం ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ కావడంతో రాజకీయ వర్గాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. రాత్రి వేళ జరిగిన ఈ ఆపరేషన్ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ సోదాల సమయంలో అనూహ్యమైన, అత్యంత ప్రమాదకరమైన పరిణామం ఎదురైంది. పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తూ నమిత్ శర్మ అనే వ్యక్తి కాల్పులకు తెగబడ్డాడు. రోహిత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాలతోనే పోలీసులపైకి కాల్పులు జరిగాయని ఎఫ్ఐఆర్‌లో పోలీసులు స్పష్టంగా పేర్కొన్నారు. దీంతో ఈ కేసు కేవలం డ్రగ్స్ వినియోగం వరకే పరిమితం కాకుండా, పోలీసులపై దాడి, హత్యాయత్నం, అక్రమ ఆయుధ వినియోగం వంటి తీవ్రమైన సెక్షన్ల కిందకు చేరింది. ప్రజాప్రతినిధులు ఉండాల్సిన చోట ఇలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన కలిగించింది. మొయినాబాద్ పోలీసులు ఈ కేసులో మొత్తం 11 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పైలట్ రోహిత్ రెడ్డిని ప్రధాన నిందితుడిగా (A1) పేర్కొంటూ పోలీసులు అరెస్ట్ చేశారు. కాల్పులు జరిపిన నమిత్ శర్మ, మరో నిందితుడు రితేశ్ రెడ్డిలను కూడా వెంటనే అదుపులోకి తీసుకున్నారు. వీరికి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించడంతో, పోలీసులు వీరిని కట్టుదిట్టమైన భద్రత మధ్య చంచల్‌గూడ జైలుకు తరలించారు. మిగిలిన ఎనిమిది మందికి స్టేషన్ బెయిల్ మంజూరు చేసినప్పటికీ, విచారణకు ఎప్పుడు పిలిచినా హాజరు కావాలని పోలీసులు కఠినమైన షరతులు విధించారు. రాజకీయంగా ప్రాధాన్యత ఉన్న వ్యక్తులు, ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎంపీ ఈ కేసులో ఉండటంతో దర్యాప్తులో పారదర్శకత కోసం ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. సీపీ సుధీర్ బాబు పర్యవేక్షణలో ఉండే ఈ తొమ్మిది మంది అధికారుల బృందం, డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి? సరఫరాదారులు ఎవరు? అనే కోణంలో లోతైన దర్యాప్తు చేయనుంది. ఫామ్ హౌస్‌లో జరిగిన పార్టీకి ఎవరెవరు హాజరయ్యారు, సీసీ టీవీ ఫుటేజ్, ఫోన్ కాల్ డేటా ఆధారంగా మరికొంత మంది ప్రముఖుల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందన్న వార్తలు రాజకీయ గల్లీల్లో జోరుగా వినిపిస్తున్నాయి.

ఈ కేసు బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా పెద్ద దెబ్బగా మారింది. మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఏ1గా ఉండటంతో ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై, బీఆర్ఎస్ నైతికతపై విమర్శలు గుప్పిస్తున్నాయి. అయితే, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసిన వారు ఎంతటి హోదాలో ఉన్నా ఉపేక్షించే ప్రసక్తే లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. డ్రగ్స్ రహిత తెలంగాణగా మార్చే క్రమంలో ఈ కేసు దర్యాప్తును ఒక ఉదాహరణగా నిలపాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం సిట్‌కు పూర్తి స్థాయి అధికారాలు కల్పించారు. మరోవైపు ఏపీకి చెందిన ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌కు డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ రావడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ వేడి పుట్టించింది. ప్రజాప్రతినిధులు ఇలాంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాల్లో పాల్గొనడం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సిట్ అధికారులు ఇప్పటికే ఆ ఫామ్ హౌస్‌ను సీజ్ చేసి, అక్కడ లభ్యమైన మత్తు పదార్థాలు, ఇతర కీలక ఆధారాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపారు. నిందితుల గత రికార్డులను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. వారికి అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాలతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా అన్న కోణం కూడా సిట్ దర్యాప్తులో కీలకం కానుంది.

జైలులో ఉన్న రోహిత్ రెడ్డిని, ఇతర నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు సిట్ అధికారులు త్వరలో కోర్టులో పిటిషన్ వేయనున్నారు. ముఖ్యంగా పోలీసులపై కాల్పులు జరిపిన ఆయుధానికి సంబంధించిన లైసెన్స్ వివరాలు, ఆ సమయంలో రోహిత్ రెడ్డి పాత్రపై స్పష్టత రావాల్సి ఉంది. నగర శివార్లలోని ఫామ్ హౌస్ సంస్కృతి,అక్కడ జరుగుతున్న రహస్య పార్టీలపై ఇకపై కఠిన నిఘా ఉంచాలని ముఖ్యమంత్రి ఇప్పటికే పోలీసు శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాబోయే రోజుల్లో సిట్ దర్యాప్తులో మరిన్ని సంచలన విషయాలు బయటపడే అవకాశం ఉంది. ముఖ్యంగా గోవా లేదా ముంబై నుంచి డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలతో వీరికి ఏమైనా లింకులు ఉన్నాయా అనే కోణంలో విచారణ సాగుతోంది. సిట్ ఏర్పాటుతో దర్యాప్తు వేగవంతం కావడంతో, ఈ కేసులో తదుపరి అరెస్టులు ఎవరివి ఉంటాయనేది రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాజకీయ పరపతిని ఉపయోగించి కేసు నుంచి తప్పించుకోకుండా ఉండేలా సిట్ తన నివేదికను పక్కా ఆధారాలతో సిద్ధం చేస్తోంది. మొత్తానికి మొయినాబాద్ ఫామ్ హౌస్ ఉదంతం తెలంగాణ రాజకీయాల్లో ఒక పెద్ద కుదుపును తీసుకువచ్చింది. ఇది కేవలం ఒక డ్రగ్స్ కేసు మాత్రమే కాదు, వ్యవస్థను సవాల్ చేసేలా కాల్పులు జరగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. సిట్ తన దర్యాప్తును ఎంత వేగంగా ముగిస్తుందో, బాధ్యులకు ఎలాంటి శిక్షలు పడతాయో వేచి చూడాలి. ఈ కేసు ఫలితం రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని డ్రగ్స్ మాఫియాపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది.

# అసెంబ్లీలో రచ్చ రచ్చ..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




"మీరు చేసిన పాపాలను కడుగుతూనే మేము సంక్షేమాన్ని అందిస్తున్నాం" అని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చర్చలో జోక్యం చేసుకుంటూ కేటీఆర్‌పై నిప్పులు చెరిగారు. 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, కోటి ఆరు లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను ఊరించారని, కానీ తాము ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను రూ. 22,500 కోట్లతో నిర్మిస్తున్నామని తెలిపారు. "మీరు తెచ్చిన అప్పులకు అసలు, వడ్డీలు కడుతూనే తాము ఈ పనులన్నీ చేస్తున్నాం" అని భట్టి స్పష్టం చేశారు. రైతు భరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ. 9,000 కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని, సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని వెల్లడించారు. కేటీఆర్ తన ప్రసంగంలో కాంగ్రెస్ పాలనను "ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు" అని అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలి సంతకం పెట్టిన ఫైలుకే దిక్కులేదని, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 ఊసే లేదని మండిపడ్డారు. ప్రజా పాలనలో వచ్చిన కోటీ 85 లక్షల దరఖాస్తులు ఏమయ్యాయని, అవి గల్లంతయ్యాయా అని ప్రశ్నించారు. ఎన్నికల ముందు దానకర్ణలా కనిపించిన సీఎం, ఇప్పుడు కుంభకర్ణలా నిద్రపోతున్నారని సెటైర్లు వేశారు. టీ20 మాదిరిగా '420' పోటీలు పెడితే ఈ ప్రభుత్వమే గెలుస్తుందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ రెండేళ్ల పాలన ప్రజలకు కేవలం నిరాశనే మిగిల్చిందని ఆయన దుయ్యబట్టారు.

మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ, కేటీఆర్ ప్రసంగం అంతా ఊకదంపుడుగా ఉందని విమర్శించారు. ఎవరో రాసిన స్క్రిప్టును కేటీఆర్ చదువుతున్నారని, అందులో వాస్తవాలు లేవని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే మంత్రులం ఢిల్లీకి వెళ్లి నిధులు అడుగుతున్నామని, బీఆర్ఎస్ నేతల్లా ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి వెళ్లడం లేదని చురకలంటించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనే ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరించారని, ఇప్పటికీ కేటీఆర్ అబద్ధాలతో కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. ఐటీ ఎగుమతుల విషయంలో కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు సత్యదూరమని, రాష్ట్రంలో పెట్టుబడులు పెరగడానికి తాము చేస్తున్న కృషిని ప్రజలు గమనిస్తున్నారని శ్రీధర్ బాబు చెప్పారు.

ఐటీ ఎగుమతుల విషయంలో కేటీఆర్ మళ్లీ స్పందిస్తూ, ప్రభుత్వం గణాంకాలను తారుమారు చేస్తోందని ఆరోపించారు. బయట ఒక మాట, సభలో మరో మాట చెబుతున్నారని విమర్శించారు. ఐటీ రంగం పురోగతి గురించి గవర్నర్ ప్రసంగంలో స్పష్టత లేదని, ఎగుమతులు తగ్గాయని స్వయంగా నివేదికలే చెబుతున్నాయని ఆయన ఎత్తిచూపారు. ఢిల్లీకి వెళ్తే నిధులు వస్తాయనుకుంటే, ఉన్న నిధులను కూడా కేంద్రానికి ఇచ్చేసి వస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. దీనిపై సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య పెద్ద ఎత్తున వాగ్వాదం జరిగింది. ఒకానొక దశలో స్పీకర్ జోక్యం చేసుకుని సభ్యులను శాంతపరిచారు. అసెంబ్లీలో జరిగిన ఈ చర్చలో ఇరుపక్షాల మధ్య పాత అప్పులు, కొత్త హామీల చుట్టూ వాదనలు నడిచాయి. కేటీఆర్ ప్రభుత్వంపై 'అట్టర్ ఫ్లాప్' ముద్ర వేయడానికి ప్రయత్నించగా, మంత్రులు తాము చేస్తున్న అభివృద్ధిని గణాంకాలతో సహా వివరించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, రైతు బోనస్ వంటి అంశాలను కాంగ్రెస్ బలంగా వినిపించింది. అయితే, బీఆర్ఎస్ మాత్రం ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని పదేపదే ఎత్తిచూపింది. దళిత ముఖ్యమంత్రి, మూడు ఎకరాల భూమి వంటి పాత వాగ్దానాలను గుర్తు చేస్తూ భట్టి విక్రమార్క బీఆర్ఎస్ వైఖరిని ఎండగట్టారు. కేటీఆర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యబద్ధంగా తాము నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. "మీరు ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లినా మాకు అభ్యంతరం లేదు, కానీ రాష్ట్రానికి పైసా నిధులు తేవడం లేదు" అని విమర్శించారు. ప్రజా పాలన పేరుతో అట్టర్ ఫ్లాప్ షో నడుస్తోందని, ప్రజలు త్వరలోనే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మరోవైపు మంత్రులు కూడా తగ్గేదేలే అన్నట్లుగా.. సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలోకి వెళ్తున్నాయని, బీఆర్ఎస్ ఓటమిని తట్టుకోలేక ఇలాంటి విమర్శలు చేస్తోందని కొట్టిపారేశారు. ఈ సమావేశాలు తెలంగాణ రాజకీయాల్లో రాబోయే వేడికి నిదర్శనంగా నిలిచాయి. బడ్జెట్ అంకెలు, పథకాల అమలు, గత ప్రభుత్వ అప్పులు ప్రధానాంశాలుగా చర్చ సాగింది. అధికార పక్షం తమ పథకాలను డిఫెండ్ చేసుకుంటూనే, ప్రతిపక్షంపై ఎదురుదాడికి దిగింది. ప్రతిపక్షం మాత్రం ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలను ఎప్పుడు అమలు చేస్తుందో చెప్పాలని నిలదీస్తోంది. ఈ చర్చలు రాబోయే రోజుల్లో అసెంబ్లీలో మరిన్ని రసవత్తర పరిణామాలకు దారితీసేలా కనిపిస్తున్నాయి. సభలో కేటీఆర్ వర్సెస్ మంత్రుల పోరు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.


# రూ.18 వేల కోట్ల కుంభకోణం

**మొదటిపేజీ తరువాయి**




వెనుక ఉన్న అసలు ఉద్దేశం కేవలం కమీషన్ల వసూలేనని ఆయన ఆరోపించారు. రోడ్ల నెట్‌వర్క్ అభివృద్ధి పేరుతో జరుగుతున్న ఈ అక్రమాల్లో ప్రధానంగా రెండు కీలక శాఖలు కేంద్రబిందువుగా మారాయని ఆయన పేర్కొన్నారు. ఈ కుంభకోణం ప్రధానంగా రోడ్లు, భవనాల శాఖతో పాటు పంచాయతీ రాజ్ విభాగాల్లో విస్తరించి ఉందని హరీష్ రావు వివరించారు. ఆర్ అండ్ బీ శాఖలో సుమారు రూ.12 వేల కోట్ల పనులు, పంచాయతీ రాజ్ శాఖలో రూ.6 వేల కోట్ల పనులకు సంబంధించి ఇప్పటికే రంగం సిద్ధమైందని తెలిపారు. ఈ పనుల కేటాయింపులో పారదర్శకతను పూర్తిగా పక్కన పెట్టారని, ముఖ్యంగా కాంట్రాక్టర్ల ప్రయోజనాలే పరమావధిగా నిబంధనలను రూపొందించారని ఆయన మండిపడ్డారు. ప్రజల కష్టార్జితమైన సొమ్మును ఇలా అడ్డగోలుగా అప్పనంగా కాంట్రాక్టర్లకు దోచిపెడుతుండటం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల పేరిట కాంట్రాక్టర్లకు ముందస్తు నిధులను మంజూరు చేసినప్పుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానిని తీవ్రంగా వ్యతిరేకించారని హరీష్ రావు గుర్తు చేశారు. అప్పట్లో మొబిలైజేషన్ అడ్వాన్స్‌లను ఒక పాపంగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు తన ప్రభుత్వంలో ఏకంగా 10 శాతం మేర అడ్వాన్స్‌లను మంజూరు చేస్తుండటం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. అధికారం చేపట్టకముందు ఒక మాట, అధికారం వచ్చాక మరో మాట చెబుతూ ప్రజలను వంచిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అడ్వాన్స్‌ల వెనుక భారీ ఎత్తున కమీషన్ల చేతులు మారినట్లు తమకు సమాచారం ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. టెండర్ల ప్రక్రియలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును హరీష్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. సాధారణంగా భారీ టెండర్లకు కౌన్సిల్ ఆఫ్ టెండర్స్ అనుమతి తప్పనిసరి అని, అయితే ఆ నిబంధనను పక్కనపెట్టి కేవలం డిపార్ట్‌మెంట్ స్థాయిలోనే అనుమతులు ఇచ్చుకునేలా వెసులుబాటు కల్పించారని ఆరోపించారు. నిబంధనలను తుంగలో తొక్కి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వెనుక ఉన్న మర్మమేంటని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రక్రియ వల్ల అవకతవకలను ప్రశ్నించే అవకాశం లేకుండా పోతుందని, దీనివల్ల కేవలం ప్రభుత్వానికి నచ్చిన కాంట్రాక్టర్లకు మాత్రమే పనులు దక్కుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం 34 టెండర్ ప్యాకేజీలకు గాను ఇప్పటికే 24 ప్యాకేజీలకు సంబంధించిన టెండర్లు ఓపెన్ అయ్యాయని హరీష్ రావు వెల్లడించారు. ఈ ప్యాకేజీల కేటాయింపులో కాంట్రాక్టర్ల మధ్య రహస్య ఒప్పందాలు కుదిరాయని, ప్రభుత్వం కూడా వారికి సహకరిస్తోందని ఆరోపించారు. అంచనా వ్యయం కంటే 20 నుండి 30 శాతం అధిక ధరలకు టెండర్లు వేయించారని, దీనివల్ల ఖజానాపై వేల కోట్ల భారం పడుతుందని హెచ్చరించారు. ఈ సిండికేట్ వెనుక ఉన్న సూత్రధారులను పట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజాధనాన్ని ఇలా దుర్వినియోగం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. ఈ అక్రమాల ద్వారా వసూలు చేసే కమీషన్లను ప్రభుత్వం ఇతర రాష్ట్రాల ఎన్నికల ఖర్చు కోసం మళ్లిస్తోందని హరీష్‌రావు ఒక సంచలన ఆరోపణ చేశారు. తెలంగాణను ఒక ఏటీఎంలా వాడుకుంటూ, ఇక్కడి సంపదను కాంగ్రెస్ పార్టీ అవసరాల కోసం ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి పేరుతో చేసే ఈ దోపిడీని ప్రజలందరూ గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి ఇతర రాష్ట్రాల్లో రాజకీయం చేయడం సమంజసం కాదని ఆయన ప్రభుత్వానికి హితవు పలికారు. గత ప్రభుత్వంపై లేనిపోని అవినీతి ముద్రలు వేసిన వారు, ఇప్పుడు తాము చేస్తున్న ఈ దోపిడీకి ఏం సమాధానం చెబుతారని హరీష్ రావు నిలదీశారు. పారదర్శకత గురించి గొప్పలు చెప్పే ముఖ్యమంత్రి, ఈ రూ.18 వేల కోట్ల స్కాంపై నోరు మెదపాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై తక్షణమే ఒక స్వతంత్ర కమిటీతో విచారణ జరిపించాలని, లేనిపక్షంలో న్యాయపరమైన పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ధనానికి కాపలాదారులుగా ఉండాల్సిన వారే దోపిడీదారులుగా మారడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు.

# సినీ హీరోయిన్ రేణు దేశాయ్‌పై అభ్యంతరకరమైన పోస్టులు.. నిందితుడు అరెస్ట్



**శేరిలింగంపల్లి విశాలభారతి:** నటి రేణు దేశాయ్ పై సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో అభ్యంతరకరమై పోస్ట్‌లు పెట్టిన వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు.బ్యాడ్ కంటెంట్‌ను పోస్ట్ చేసిన నిందితుడిని గుర్తించి అరెస్టు చేయాలని రేణు దేశాయ్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న కోటిపల్లి వెంకన్నగా గుర్తించారు. అతను తన ఖాళీ సమయంలో తరచుగా ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చూసేవాడు.ఇటీవల, ఇన్‌స్టాగ్రామ్ బ్రౌజ్ చేస్తున్నప్పుడు నటి రేణు దేశాయ్ రీల్‌ను నిందితుడు చూశాడు. ఆ రీల్ చూసిన తర్వాత తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుండి దూషిస్తూ పోస్ట్ చేశాడు. సైబర్ క్రైమ్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన కంటెంట్‌ను పోస్ట్ చేసే వ్యక్తులు సభ్యత పాటించాలని ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు. పౌరులు డిజిటల్ ప్లాట్ ఫారమ్‌లను బాధ్యతాయుతంగా ఉపయోగించాలని, ఏదైనా ఇబ్బందులు ఎదురైతే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు లేదా 1930 సైబర్ హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు.

# ఎఫ్‌టీఎల్‌లో అక్రమ రోడ్డు నిర్మాణం



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగా రెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండల పరిధిలోని అనాజ్‌పూర్ గ్రామంలో వేముల కత్వ ఇందిరా సాగర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో జీనియస్ రియల్ ఎస్టేట్ సంస్థ భారీగా రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ అంశంపై సీపీఎం పార్టీ అబ్దుల్లాపూర్ మెట్టు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానికంగా పర్యటించి, చెరువు పరిరక్షణకు విఘాతం కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ డీఈ ఆంజనేయులు మంగళవారం వేముల కత్వ ఇందిరా సాగర్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. పరిశీలనలో ఎఫ్‌టీఎల్ పరిధిలో రోడ్డు నిర్మాణం జరుగుతున్నది నిజమేనని నిర్ధారించిన ఆయన, ఇటువంటి అక్రమ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఎవరైనా సరే నిబంధనలు ఉల్లంఘించి చెరువు పరిధిలో రోడ్లు వేస్తే ఉపేక్షించబోమని, సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నరసింహ మాట్లాడుతూ..చెరువు కబ్జాలపై ఇప్పటికే కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌లకు పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్‌టీఎల్‌లో రోడ్డు నిర్మాణం తక్షణమే నిలిపివేసి, ఇప్పటికే వేసిన నిర్మాణాలను తొలగించాలని డీఈను కోరారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే సీపీఎం పార్టీతో పాటు అఖిలపక్ష కమిటీ ఏర్పాటుచేసి ఉధృతంగా పోరాటం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు వరకాల ముత్యాలు, కావలి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో ఎందుకు ఉండాలి

- **సంజయ్ అసలు ఏ పార్టీలో ఉన్నారో ఆయనకే తెలియదు**
- **బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయి ఉండి కాంగ్రెస్ వ్యవహారాల్లో జోక్యం**
- **నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకునేలా సంజయ్ ప్రవర్తన**
- **గత 20 నెలలుగా నియోజకవర్గానికి సంజయ్ చేసింది శూన్యం**
- **పార్టీ మార్పుపై ఏ నిర్ణయం తీసుకున్నా చట్టబద్ధంగానే ఉంటుంది**
- **తాను ఎక్కడ ఉన్నా ప్రజల కోసమే అంకితభావంతో పనిచేస్తాను**



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జగిత్యాల నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు ఇప్పుడు అత్యంత క్లిష్ట దశకు చేరుకున్నాయి. సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై నిప్పులు చెరిగారు. "సంజయ్ కుమార్ అసలు ఏ పార్టీలో ఉన్నారో ఎవరికైనా తెలుసా? కనీసం ఆయనకైనా క్లారిటీ ఉందా?" అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. ఒకవైపు సంజయ్ బీఆర్ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచారని, ఆయన ఇంకా ఆ పార్టీలోనే ఉన్నారని అసెంబ్లీ స్పీకర్ చెబుతుంటే.. సంజయ్ మాత్రం కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం దారుణమని మండిపడ్డారు. తాను కాంగ్రెస్‌లో దశాబ్దాలుగా ఉన్నానని, అలాంటి తనతో కలిసి పనిచేస్తానని సంజయ్ అనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. అసలు తనకు ఆఫర్లు ఇచ్చే స్థాయి, అర్హత సంజయ్‌కు ఎక్కడిదని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పార్టీతో తనకు ఉన్న 40 ఏళ్ల అనుబంధం ఒక విడదీయరాని బంధమని, దానిని తెంచుకోవడం తన ప్రాణం పోయినంత బాధాకరమని జీవన్ రెడ్డి భావోద్వేగంతో చెప్పారు. అయితే, సంజయ్ కుమార్ అనుసరిస్తున్న తీరు ఆ బంధాన్ని బలవంతంగా తెంచేలా ఉందని ఆరోపించారు. సంజయ్ ఒకవైపు కాంగ్రెస్ శ్రేణులను ఇబ్బంది పెడుతూ, పైకి మాత్రం తానేదో పార్టీ అభివృద్ధి కోసం పాటుపడుతున్నట్లు శ్రీరంగ నీతులు చెబుతున్నారని విమర్శించారు. ఆయన మాటలకు, చేతలకు అసలు పొంతన ఉండటం లేదని, ఇది క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలను తీవ్ర అయోమయానికి గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో క్రమశిక్షణ కరువైందని, కొత్తగా వచ్చిన వారు సీనియర్లను గౌరవించడం మానేసి, పెత్తనం చెలాయించాలని చూడటం సహించరానిదని ఆయన స్పష్టం చేశారు.

నియోజకవర్గ అభివృద్ధి విషయంలో కూడా జీవన్ రెడ్డి ఎమ్మెల్యేపై తీవ్ర విమర్శలు చేశారు. గత 20 నెలలుగా సంజయ్ కుమార్ జగిత్యాల నియోజకవర్గంలో సాధించిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఒక విద్యావంతుడు, డాక్టర్ అయి ఉండి కూడా ప్రజల సమస్యల పట్ల కనీస అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి కోసం ముఖ్యమంత్రితో లేదా ప్రభుత్వంతో కలిసి పనిచేయడం మంచిదే అని, అందులో ఎవరికీ అభ్యంతరం ఉండదని.. కానీ ఆ నెపంతో కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాల్లో వేలు పెట్టడం సరికాదని హితవు పలికారు. గతంలో తాను కేసీఆర్‌తో కలిసి పనిచేసినప్పుడు కూడా ఇలాంటి ఇబ్బందికర, అవమానకర పరిస్థితులు ఎదుర్కోలేదని గుర్తు చేసుకున్నారు. ఇన్ని సంవత్సరాల రాజకీయ అనుభవంలో ఇలాంటి సంకుచిత ధోరణిని ఎక్కడా చూడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పార్టీ మార్పు అంశంపై వస్తున్న ఊహాగానాలకు జీవన్ రెడ్డి తనదైన శైలిలో సమాధానమిచ్చారు. తాను ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, అలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చెప్పారు. కానీ, ఆత్మగౌరవం దెబ్బతిన్న చోట ఉండటం కంటే, ఆ బంధం తెగిపోతే ఎవరూ ఏమీ చేయలేరని వ్యాఖ్యానించారు. ఒకవేళ పార్టీ మారాల్సి వస్తే, తాను ఏ నిర్ణయం తీసుకున్నా అది ప్రజల హితం కోసమే ఉంటుందని మరియు రాజ్యాంగబద్ధంగానే ఉంటుందని స్పష్టం చేశారు. పదవిలో ఉన్నా లేకున్నా, తాను ఎక్కడ ఉన్నా అంకితభావంతో ప్రజల కోసమే పనిచేస్తానని తన నిబద్ధతను చాటుకున్నారు. "నేను పార్టీ మారుతానని సంజయ్‌కు ఏమైనా చెప్పానా? ఆయన నా ప్రతినిధిలా ఎందుకు మాట్లాడుతున్నారు?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వ్యక్తిగత నిర్ణయాలను ఇతరులు ప్రభావితం చేయలేరని ఆయన నొక్కి చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంలో కాంగ్రెస్ అధిష్టానం తీరుపై కూడా జీవన్ రెడ్డి అనుచరులు అసంతృప్తితో ఉన్నారు. సీనియర్ నేతలను పక్కనపెట్టి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యతనివ్వడం వల్ల పార్టీ నైతిక స్థైర్యం దెబ్బతింటుందని వారు హెచ్చరిస్తున్నారు. జగిత్యాల వంటి బలమైన నియోజకవర్గంలో ఇలాంటి గ్రూపు రాజకీయాలు కొనసాగితే, అది భవిష్యత్తులో పార్టీ ఉనికికే ప్రమాదమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంజయ్ కుమార్ తన పద్ధతి మార్చుకోకపోతే లేదా అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకోకపోతే జీవన్ రెడ్డి వంటి బలమైన గొంతుకను కాంగ్రెస్ కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. పార్టీ కార్యకర్తలు కూడా ఇద్దరు నేతల మధ్య నలిగిపోతున్నారని, ఇది రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. జగిత్యాల రాజకీయాల్లో నెలకొన్న ఈ సంక్షోభం కేవలం ఆ జిల్లాకే పరిమితం కాకుండా, రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న అంతర్గత సమస్యలకు అద్దం పడుతోంది. ఫిరాయింపుల వల్ల వస్తున్న ఇబ్బందులు, పాతకొత్త నేతల మధ్య సమన్వయ లోపం ఈ ఘటన ద్వారా స్పష్టంగా కనిపిస్తోంది. ఉగాది పండుగ తర్వాత జీవన్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై తుది నిర్ణయం ప్రకటిస్తానని చెప్పడంతో ఇప్పుడు అందరి కళ్లు ఆ ముహూర్తంపైనే ఉన్నాయి. మరి అధిష్టానం ఆయనను బుజ్జగించి పార్టీలో ఉంచుకుంటుందా, లేక జీవన్ రెడ్డి తన 40 ఏళ్ల ప్రస్థానానికి ముగింపు పలికి కొత్త దారి వెతుక్కుంటారా అన్నది వేచి చూడాలి. రాష్ట్రస్థాయి నేతలు ఈ విషయంలో మౌనం వహించడం కూడా అనేక అనుమానాలకు తావిస్తోంది. ఏదేమైనా, జీవన్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు జగిత్యాల కాంగ్రెస్‌లో ఒక పెద్ద కుదుపును తీసుకువచ్చాయి. ఇది కేవలం రాజకీయ అధికారం కోసం జరుగుతున్న పోరాటం కాదు, ఇది ఆత్మగౌరవం మరియు సిద్ధాంతాల మధ్య జరుగుతున్న పోరాటంగా కనిపిస్తోంది. 40 ఏళ్ల చరిత్ర ఉన్న నాయకుడు ఇంతలా బహిరంగంగా అసహనం వ్యక్తం చేస్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాబోయే రోజుల్లో ఈ వివాదం ఏ మలుపు తిరుగుతుందో అని అటు రాజకీయ వర్గాల్లో, ఇటు సామాన్య ప్రజల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

# ఇరాన్ భద్రతా చీఫ్ అలీ లారిజానీ హతం

- **ఇజ్రాయెల్ దాడుల్లో అలీ లారిజానీ మరణించినట్లు కథనాలు**
- **అత్యంత కీలకమైన నేతను కోల్పోవడం ఆ దేశానికి కోలుకోలేని దెబ్బ**
- **సమాచారం ఇస్తే రూ.83 కోట్ల బహుమతి ప్రకటించిన కొద్దిసేపటికే**
- **ఇరాన్ నిరసనలు ఏఐ సృష్టించినవన్న ట్రంప్ వ్యాఖ్యలపై ఆగ్రహం**
- **ముస్లిం దేశాల తీరుపై లారిజానీ మరణానికి ముందు సంచలన వ్యాఖ్యలు**
- **ఇరాన్ సైనిక కమాండర్ల లక్ష్యంగా సాగుతున్న దాడులతో యుద్ధ మేఘాలు**



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య దశాబ్దాలుగా సాగుతున్న నీడల యుద్ధం ఇప్పుడు నేరుగా క్షిపణులు, బాంబుల మోతతో రణరంగంగా మారింది. ఈ క్రమంలో ఇరాన్ రాజకీయాల్లో అత్యంత తలపండిన నేత, సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ మాజీ కార్యదర్శి అలీ లారిజానీ ఇజ్రాయెల్ దాడుల్లో మరణించినట్లు వస్తున్న వార్తలు ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తున్నాయి. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ఈ విషయాన్ని ధృవీకరించినట్లు టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ కథనం వెలువడటంతో, ఇరాన్ అధికార యంత్రాంగంలో గుబులు మొదలైంది. ఒకప్పుడు అణు ఒప్పందాల విషయంలో ప్రపంచ దేశాలను గడగడలాడించిన లారిజానీ, నేడు యుద్ధ తంత్రానికి బలయ్యారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఇరాన్ పొలిట్రికల్ మ్యాప్‌లో లారిజానీకి ఉన్న ప్రాముఖ్యత అంతా ఇంతా కాదు. యుద్ధం మొదలైన తొలి రోజుల్లోనే సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఆ భారీ లోటు నుంచి ఇరాన్ ఇంకా కోలుకోకముందే, ఇప్పుడు లారిజానీ వంటి చాణక్యుడిని కోల్పోవడం ఆ దేశానికి వెన్నెముక విరిగినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఖుద్స్ డే ర్యాలీలో చివరిసారిగా కనిపించిన ఆయన, అమెరికాఇజ్రాయెల్ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. అయితే సరిగ్గా అదే సమయంలో అమెరికా ఆయన తలపై 10 మిలియన్ డాలర్ల రివార్డు ప్రకటించడం వెనుక పక్కా ప్లాన్ ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం లారిజానీ మాత్రమే కాకుండా, బాసిజ్ రెసిస్టెన్స్ ఫోర్స్ చీఫ్ గులాంరెజా సులేమానీ సహా మరో పదిమంది కీలక కమాండర్లను ఇజ్రాయెల్ టార్గెట్ చేయడం చూస్తుంటే ఇరాన్ మిలిటరీ మేధావులను ఏరిపారేసే వ్యూహంలో మొసాద్ సఫలమైనట్లు కనిపిస్తోంది.

ఈ పరిణామాల మధ్య ఇరాన్ ప్రభుత్వ మీడియా 'ప్రెస్ టీవీ' విడుదల చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో వేడిని పెంచింది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ఇరాన్ నిరసనకారులను హేళన చేయడాన్ని లారిజానీ తీవ్రంగా తప్పుబట్టారు. ఇరాన్ వీధుల్లో జరుగుతున్న లక్షలాది మంది ప్రదర్శనలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సృష్టించిన ఫేక్ ఇమేజ్‌లుగా ట్రంప్ అభివర్ణించడంపై లారిజానీ తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. గతాన్ని గుర్తు చేస్తూ, పహ్లవీ పాలకులు కూడా ప్రజల గొంతుకను ఇలాగే తక్కువ చేసి చూశారని, చివరకు ఏమైందో అందరికీ తెలుసని హెచ్చరించారు. ఎప్‌స్టీన్ ఐలాండ్ వంటి వివాదాలను ప్రస్తావిస్తూ అమెరికా నైతికతను ప్రశ్నించడం ద్వారా ఆయన తన చివరి రోజుల్లో కూడా దూకుడు తగ్గించలేదని స్పష్టమవుతోంది.

మరోవైపు, మరణానికి కొద్ది గంటల ముందు లారిజానీ విడుదల చేసిన వీడియో సందేశం ముస్లిం ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. ముస్లిం మెజారిటీ దేశాలు ఇరాన్‌కు అండగా నిలవకపోవడంపై ఆయన తన ఆవేదనను వెళ్లగక్కారు. ఇస్లామిక్ విప్లవానికి ప్రతీకగా ఉన్న ఇరాన్‌ను విచ్ఛిన్నం చేసేందుకు జియోనిస్ట్ శక్తులు ఏకమవుతుంటే, మిగిలిన అరబ్ దేశాలు మౌనంగా ఉండటం ద్రోహంతో సమానమని ఆయన విమర్శించారు. ఇరాన్ ఎదుర్కొంటున్నది కేవలం సరిహద్దు యుద్ధం కాదని, ఇది అస్తిత్వ పోరాటమని ఆయన నొక్కి చెప్పారు. అమెరికా సాయంతో ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులకు ఇరాన్ పౌరులు, సైనిక కమాండర్లు బలి కావడాన్ని ఆయన అమరత్వంగా అభివర్ణించారు. ప్రస్తుతానికి ఇరాన్ ప్రభుత్వం లారిజానీ మరణ వార్తపై అధికారికంగా పెదవి విప్పకపోయినప్పటికీ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు యుద్ధ తీవ్రతను సూచిస్తున్నాయి. టెహ్రాన్ వీధుల్లో ఉద్రిక్తత నెలకొంది. లారిజానీ వంటి సీనియర్ దౌత్యవేత్త, వ్యూహకర్త లేని లోటు ఇరాన్ విదేశాంగ విధానంపై తీవ్ర ప్రభావం చూపనుంది. అణు చర్చల్లో ఆరితేరిన ఆయన, పశ్చిమ దేశాలతో ఎలా వ్యవహరించాలో తెలిసిన వ్యక్తి. ఆయన నిష్క్రమణ ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ లోని అతివాద శక్తులకు మరింత పట్టు ఇచ్చే అవకాశం ఉంది, ఇది యుద్ధాన్ని మరింత రక్తపాతంగా మార్చవచ్చు.

ఇజ్రాయెల్ ఈ ఆపరేషన్‌ను సర్జికల్ ప్రిసిషన్‌తో నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇంటెలిజెన్స్ సమాచారం ప్రకారం, లారిజానీ కదలికలను ట్రాక్ చేస్తూ అమెరికా ప్రకటించిన రివార్డు మనీ కూడా స్థానిక ఇన్ఫార్మర్లను ఆకర్షించి ఉండవచ్చు. ఇరాన్ గడ్డపైనే అంతటి శక్తివంతమైన నేతను మట్టుబెట్టడం ద్వారా ఇజ్రాయెల్ తన గూఢచారి వ్యవస్థ ఎంత బలంగా ఉందో మరోసారి చాటిచెప్పింది. ఇది కేవలం ఒక వ్యక్తి మరణం కాదు, ఇరాన్ రక్షణ కవచంలో పడిన అతిపెద్ద రంధ్రం. రాబోయే రోజుల్లో ఇరాన్ దీనికి ఎలాంటి ప్రతీకారం తీర్చుకుంటుందనేది ఇప్పుడు ప్రపంచదేశాలను కలవరపెడుతోంది.

పశ్చిమాసియా సంక్షోభం ఇప్పుడు కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణగా మిగిలిపోలేదు. ఇటు రష్యా, చైనా మద్దతు కోసం ఇరాన్ ప్రయత్నిస్తుంటే, అటు అమెరికా బాహాటంగానే ఇజ్రాయెల్‌కు వెన్నుదన్నుగా నిలుస్తోంది. లారిజానీ మరణం ఒకవేళ వాస్తవమైతే, అది ఇరాన్ ప్రజల్లో ఆవేశాన్ని రగిలించి 'టోటల్ వార్'కు దారితీసే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఆర్థికంగా కుదేలైన ఇరాన్, ఇలాంటి సమయంలో తన అగ్రనేతలను కోల్పోవడం ఆ దేశ పతనానికి నాంది కానుందా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇరాన్ ఇప్పుడు ఒక సందిగ్ధ స్థితిలో పడిపోయింది. టెక్నాలజీ యుగంలో యుద్ధం కూడా స్మార్ట్‌గా మారిపోయింది. ట్రంప్ అన్నట్లు అది ఏఐ సృష్టించిన చిత్రాలు కాకపోయినా, డ్రోన్ దాడులు మరియు డిజిటల్ నిఘా నీడలో ఇరాన్ నేతలు బెంబేలెత్తుతున్నారు. ఒకప్పుడు గెరిల్లా పోరాటాలతో శత్రువును ముప్పతిప్పలు పెట్టిన ఇరాన్, ఇప్పుడు తన సొంత గడ్డపైనే అగ్రనేతలను కాపాడుకోలేక పోవడం ఆ దేశ ఇంటెలిజెన్స్ వైఫల్యానికి నిదర్శనం. లారిజానీ లేని ఇరాన్, తన అస్థిత్వాన్ని కాపాడుకోవడానికి ఎంతటి సాహసానికైనా ఒడిగట్టవచ్చు. అగ్రరాజ్యాల జోక్యంతో ఈ ప్రాంతం మరో ప్రపంచ యుద్ధానికి వేదికవుతుందేమోనని భద్రతా నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొత్తానికి, అలీ లారిజానీ మరణం పశ్చిమాసియా సమీకరణాలను పూర్తిగా మార్చేయనుంది. దశాబ్దాల పాటు ఇరాన్ రాజకీయాల్లో చక్రం తిప్పిన ఒక ధ్రువతార నేలకూలడం, అటు ఇజ్రాయెల్‌కు విజయంగానూ, ఇటు ఇరాన్‌కు తీరని వేదనగానూ మిగిలిపోనుంది. ఆయన చివరి ప్రసంగంలో చెప్పినట్లుగా, ముస్లిం దేశాల మౌనం ఇరాన్‌ను ఒంటరిని చేసినా, ఆ దేశం తన పోరాటాన్ని ఆపబోమనే సంకేతాలు ఇస్తోంది. అయితే, ఆ పోరాటాన్ని నడిపించే నాయకత్వం ఇప్పుడు ప్రశ్నార్థకమైంది. ఇరాన్ తన పదునైన వ్యూహకర్తను కోల్పోయిన వేళ, తదుపరి అడుగు ఏ దిశగా ఉంటుందో వేచి చూడాలి.

# పీసీసీ పీఠంపై కోమటిరెడ్డి హాట్ కామెంట్స్!



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి. మాస్ లీడర్‌గా గుర్తింపు పొందిన జగ్గారెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించాలని ఆయన బహిరంగంగానే కోరారు. జగ్గారెడ్డిని దివంగత నేత పీజేఆర్‌తో పోల్చిన కోమటిరెడ్డి, ఆయనకు ఆపదలో ఉన్నవారిని ఆదుకునే గుణం ఉందని కొనియాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలవాలంటే జగ్గారెడ్డి వంటి బలమైన నాయకత్వం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్‌గా కొనసాగుతుండగా, కోమటిరెడ్డి చేసిన ఈ ప్రతిపాదన పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది. ఇది కేవలం వ్యక్తిగత అభిమానమా లేక పార్టీలో రాబోయే మార్పులకు సంకేతమా అన్నది వేచి చూడాలి. జగ్గారెడ్డి రాజకీయ ప్రస్థానం ఎంతో వైవిధ్యంగా సాగింది. సంగారెడ్డి నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన, బీజేపీలో మున్సిపల్ ఛైర్మన్‌గా ప్రస్థానం ప్రారంభించి, టీఆర్ఎస్ మీదుగా కాంగ్రెస్‌లో చేరారు. 2023 ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలైనప్పటికీ, పార్టీ ఆయన భార్య నిర్మల జగ్గారెడ్డికి టీజీఐఐసీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవి ఇచ్చి గౌరవించింది. జగ్గారెడ్డి గెలిచి ఉంటే ఖచ్చితంగా మంత్రి అయ్యేవారని రాజకీయ విశ్లేషకులు భావిస్తుంటారు. ఇటీవల మున్సిపల్ ఎన్నికల సమయంలో పోలీసులపై ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్ అయినప్పటికీ, ఆయనకున్న మాస్ ఇమేజ్ మాత్రం చెక్కుచెదరలేదు. ఆయన దూకుడు స్వభావమే పార్టీకి శ్రీరామరక్ష అని కోమటిరెడ్డి అభిప్రాయపడటం విశేషం.

మరోవైపు జగిత్యాల కాంగ్రెస్‌లో పరిస్థితులు నివురు గప్పిన నిప్పులా మారాయి. సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి పార్టీని వీడే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. జగిత్యాల ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ కారణంగానే తాను ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌తో తనకు నాలుగు దశాబ్దాల అనుబంధం ఉందని గుర్తు చేసుకుంటూ జీవన్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. సంజయ్ తీరు వల్ల ప్రజల హక్కులు దెబ్బతింటున్నాయని, వక్రమార్గాన పోయే నేతలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ హర్షించరని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సంజయ్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి రావడాన్ని జీవన్‌రెడ్డి మొదటి నుంచీ జీర్ణించుకోలేకపోతున్నారు.

జీవన్‌రెడ్డి తన కార్యాలయం నుంచి కాంగ్రెస్ ఫ్లెక్సీలను తొలగించడం పార్టీ వర్గాల్లో కలకలం రేపింది. పార్టీని వదిలేస్తే కేవలం ఫ్లెక్సీలే కాదు, అన్నీ మారిపోతాయని ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ పార్టీ వీడాల్సి వస్తే భవిష్యత్తులో ఏ పార్టీలో చేరాలనేది తర్వాత ఆలోచిస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే సంజయ్‌ను మొదటి నుంచీ జీవన్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తన వర్గానికి రావాల్సిన మున్సిపల్ ఛైర్మన్ పదవి దక్కకుండా చేశారని, తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై ఉన్న కోపం కాదు, పార్టీ అనుసరిస్తున్న విధానాలపై ఉన్న అసంతృప్తిగా కనిపిస్తోంది.

ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎంత ఎక్కువగా ఉందో చాటిచెబుతున్నాయి. ఒక సీనియర్ మంత్రి మరో నేతను పీసీసీ చీఫ్‌గా చేయాలని కోరడం, అదే సమయంలో మరో సీనియర్ నేత పార్టీ మారతానని హెచ్చరించడం వంటివి పార్టీ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారాయి. ముఖ్యంగా వలస నేతల కారణంగా పాత నేతలకు అన్యాయం జరుగుతోందన్న భావన జగిత్యాల వంటి ప్రాంతాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఇది కేవలం ఒక జిల్లాకే పరిమితం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పార్టీపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పాత కాపులు, కొత్తగా వచ్చిన వారి మధ్య సమన్వయం కుదర్చడం అధిష్టానానికి కత్తిమీద సాములా మారింది. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనూ కాంగ్రెస్ నేతలు తమ అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పేవారు. ఇప్పుడు అదే సంస్కృతి కొనసాగుతున్నట్లు కనిపిస్తోంది. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటనేది ఇంకా తెలియాల్సి ఉంది. అయితే జగ్గారెడ్డిని పీసీసీ చీఫ్‌గా ప్రాజెక్ట్ చేయడం ద్వారా పార్టీలో కొత్త సమీకరణాలకు ఆయన తెరలేపారు. జగ్గారెడ్డి వంటి దూకుడు స్వభావం ఉన్న నాయకుడు పార్టీ పగ్గాలు చేపడితే కేడర్‌లో ఉత్సాహం వస్తుందని కోమటిరెడ్డి నమ్ముతున్నారు. ప్రస్తుత పీసీసీ నాయకత్వంపై ఇది ఎలాంటి ప్రభావం చూపుతుందో అన్నది ఆసక్తికరం.

జీవన్‌రెడ్డి విషయంలో అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకోకపోతే జగిత్యాలలో పార్టీకి భారీ నష్టం జరిగే ప్రమాదం ఉంది. 40 ఏళ్ల పాటు కాంగ్రెస్ జెండాను మోసిన నేత పార్టీని వీడటం అంటే అది సామాన్య విషయం కాదు. ఎమ్మెల్యే సంజయ్ తీరును నిరసిస్తూ ఆయన చేస్తున్న వ్యాఖ్యలు ఇతర నియోజకవర్గాల్లోని సీనియర్లలో కూడా చర్చకు దారితీస్తున్నాయి. పార్టీలోకి ఇతర పార్టీల ఎమ్మెల్యేల చేరికలు ఏ స్థాయిలో అలజడి సృష్టిస్తున్నాయో జీవన్‌రెడ్డి ఆవేదన అద్దం పడుతోంది. నమ్మకమైన నేతలను కాపాడుకోవడంలో వైఫల్యం చెందితే, భవిష్యత్తులో అది పార్టీ ఉనికికే ప్రమాదం తెచ్చే అవకాశం ఉంది. మున్సిపల్ పీఠం దక్కకపోవడం, నియోజకవర్గంలో ప్రాధాన్యత తగ్గడం వంటి కారణాలు జీవన్‌రెడ్డిని తీవ్రంగా కలచివేస్తున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తనను వేధించిన నేతలే ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వచ్చి పెత్తనం చెలాయించడాన్ని ఆయన తట్టుకోలేకపోతున్నారు. ఈ సంక్షోభాన్ని అధిష్టానం ఎలా చక్కదిద్దుతుందనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఒకవేళ జీవన్‌రెడ్డి వంటి నేతను కోల్పోతే, అది పార్టీ నైతిక స్థైర్యంపై దెబ్బతీసే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి మరియు ఇతర సీనియర్ నేతలు జీవన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నా, ఆయన మాత్రం ఇంకా పట్టు వీడటం లేదు. తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో ఈ రెండు అంశాలు ఇప్పుడు ప్రధాన చర్చాంశాలుగా నిలిచాయి. ఒకవైపు పదవుల పంపకంపై బహిరంగ ప్రతిపాదనలు, మరోవైపు సీనియర్ల అసంతృప్తి జ్వాలలు పార్టీలో కలకలం రేపుతున్నాయి. ప్రజాపాలనపై దృష్టి పెట్టాల్సిన సమయంలో పార్టీ నేతల మధ్య ఇలాంటి వైరుధ్యాలు బయటపడటం ప్రభుత్వ ప్రతిష్టకు కూడా కొంత ఇబ్బందికర పరిణామమే. రాబోయే రోజుల్లో అధిష్టానం ఈ సెగలను ఎలా చల్లారుస్తుందో వేచి చూడాలి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. మొత్తానికి కాంగ్రెస్ అంటేనే స్వేచ్ఛా రాజకీయాలకు నిలయమనే నానుడిని ఈ పరిణామాలు మరోసారి రుజువు చేశాయి. నేతలు తమ మనసులోని మాటను బయటపెట్టడం ద్వారా పార్టీలో అంతర్గత మథనాన్ని ఆవిష్కరించారు. సంక్షోభ సమయంలోనే నాయకత్వ పటిమ బయటపడుతుందని, మరి ఈ సవాళ్లను అధిష్టానం ఎలా ఎదుర్కొంటుందో చూడాలి.

# ఘనంగా ముగిసిన జిల్లా స్థాయి క్రీడా పోటీలు



**పాల్వంచ విశాలభారతి:**

ఖమ్మం, మేరా యువ భారత్ (యువజన మరియు క్రీడా మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం) ఆధ్వర్యంలో పువ్వాడ నగర్ జాగృతి యూత్ అసోసియేషన్ వారు జిల్లా స్థాయి క్రీడా పోటీలను కొత్తగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నందు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా యువతులకు తాడు గుంజడం, పరుగు పందాలు మరియు షటిల్ నిర్వహించారు. యువకులకు అదే విధంగా కబడ్డీ, పరుగు పందాలు మరియు షటిల్ నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన యువతీ యువకులకు బంగారు మరియు వెండి పతకాలతో పాటు అభినందన పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ పి.పద్మ మరియు మేరా యువ భారత్ అకౌంట్స్ మరియు ప్రోగ్రాం అధికారి కమరతపు భానుచందర్ గారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, మేరా యువ భారత్ వారు యువత కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎటువంటి రుసుము లేకుండా యువతకు ఉచితంగా క్రీడా పోటీలు కూడా నిర్వహిస్తున్నారని, మేరా యువ భారత్ ప్లాట్ఫామ్ 18 నుంచి 29 సంవత్సరాల వయసు గల యువతని ప్రోత్సహిస్తుందని, విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగించుకొని గొప్ప స్థాయికి వెళ్లాలని మీకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలని అన్నారు. పి పద్మ మరియు భానుచందర్ గారి చేతుల మీదుగా విజేతలు బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పువ్వాడ నగర్ జాగృతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ షారుఖ్ ఇమ్రాన్, ఎస్.కె లాల్ అహ్మద్, పిడి యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

## మక్కల డీసీఎం బోల్తా డ్రైవర్ మృతి



**దేవరుప్పుల, విశాలభారతి:** దేవరుప్పుల మండలం పాలకుర్తి నుండి జనగాం వెళ్లే రహదారిపై మంగళవారం సాయంత్రం విషాద ఘటన చోటుచేసుకుంది. మండలం అప్పిరెడ్డిపల్లి మూల వద్ద మొక్కలతో లోడైన డీసీఎం వాహనం పాలకుర్తి నుండి భువనగిరి వెళ్తున్న డీసీఎం అప్పిరెడ్డిపల్లి వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి, సమాచారం అందుకున్న దేవరుప్పుల ఎస్సై సృజన్ కుమార్ ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సృజన్ కుమార్ మాట్లాడుతూ, ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని పూర్తి వివరాలు సేకరించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నాళేశ్వర్ మాటు కాల్వను పరిశిలించిన ఆదికారులు



**ఆర్మూర్, విశాలభారతి:** నవీపేట్ మండలంలోని ఆంకంపల్లి,నాళేశ్వర్ పోలాల మద్య నుండి ఉన్న మాటు కాలువను మంగళవారం మండల అధికారులు పరిశీలించి,మరమ్మతులకు ఆయ్యే బడ్జట్ ను రూపొందించారు.ఈ మాటు కాల్వ లోతు పుడుకపోయి,చుట్టుపక్కల మాటు భూమి తగ్గడంతో వర్షకాలం మిది నుండి వచ్చే నీటి ప్రవహంతో పంట భూములు మునిగిపోవడంతో పాటు గ్రామంలోకి అ వరద నిరు రావడం జరుగుతుంది,ఈ సమస్య ను నాళేశ్వర్ గ్రామ సర్పంచ్ భోదన్ ఏమ్మెల్యే సుదర్శన్ రేడ్డి దృష్టికి తిసుకేల్లి ఈ మాటు కాలువ కు మరమ్మతులు చేయాల్సిందిగా విన్నవించడంతో,ఏమ్మేల్యే వేంటనే స్పందించి ఇరిగేషన్,పంచాయితి రాజ్ ఆదికారులను నాళేశ్వర్ గ్రామానికి పంపించి మాటు కాలువ పరిస్థితిని,మరమ్మతులకు ఆయ్యే ఆంచనా బడ్జట్ ను రూపొందించిన త్వరితగతిన పనులు ప్రారంబించాలని కోరడంతో.ఈ వచ్చి మాటు కాలువను పరిశిలించడం జరిగింది, కార్యక్రమంలో ఇరిగేషన్ డిఈ బాలరం,ఏఈ శ్రీదర్,పంచాయితి రాజ్ డిఈ వెంకటేశ్వర్లు నాళేశ్వర్ సర్పంచ్ ఆర్మూర్ లావణ్య,ఉప సర్పంచ్ ఆర్మూర్ శ్రీనివాస్,వార్డు సభ్యలు కిషాన్ రాజు,గణేష్,మాజి సర్పంచ్ లు తిమ్మపురం సాయారేడ్డి, మగ్గరి నర్సింగ్ రావు,మాజి సోసైటి చైర్మన్ మగ్గరి హన్మండ్లు,బేల్లాల్ నర్సింగ్ రావు,గ్రామబివృద్ది కమిటి సభ్యులు గంగాదర్,లక్ష్మణ్, కోండయ్య, జనార్ధన్ గ్రామస్థులు ఉన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జరిమానా

**ఆర్మూర్ ,విశాలభారతి:** ఆర్మూర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ ఓ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ ఎన్ఫోర్స్మెంట్ నిర్వహించారు. ఈ డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఆరుగురు పట్టుబడ్డారు. వీరిని కోర్టులో హాజరు పరచగా జేఎసీఎం మెజిస్ట్రేట్ సరళ రాణి ఒక్కొక్కరికి 10000 చొప్పున మొత్తం 60 వేల రూపాయలను విధించారని ఎస్హెచ్ఓ తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి నడపరాదని, వాహనదారులకు మోటార్ వెహికల్ నూతన చట్టం ప్రకారం భారీగా జరిమానులు పెంచి జైలు శిక్ష విధిస్తారని అన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను తమ దగ్గర ఉంచుకోవాలని కోరారు.

## 15 వ వార్డులో ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్



**తిరుమలగిరి, విశాలభారతి :** తిరుమలగిరి మున్సిపాలిటీ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డులో మున్సిపాలిటీ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి, కమిషనర్ రామచంద్ర రావు లు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఏమోజు గోవిందమ్మ రవీందర్ మరియు వార్డు కౌన్సిలర్లు సంకేపల్లి జ్యోతి, నరోతం రెడ్డి,యాకుబ్ నాయక్,గీతా బాబు, సోమలక్ష్మి నరేష్ మున్సిపాలిటీ అధికారులు,సిబ్బంది వార్డు నాయకులు,కార్యకర్తలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తితో మొక్కు తీర్చుకున్న సర్పంచ్



**చిట్యాల, విశాలభారతి:** మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ సర్పంచ్ బత్తుల లక్ష్మీప్రసన్న నర్సింహా గౌడ్ భక్తితో తన మొక్కు తీర్చుకున్నారు.గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైతే శ్రీ రామలింగేశ్వరస్వామి గుట్టపైకి ఉన్న ప్రతి మెట్టుకు బొట్లు పెట్టుకుంటూ స్వామివారిని దర్శించుకుంటానని మొక్కుకున్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన చక్రరథోత్సవం సందర్భంగా కుటుంబ సమేతంగా గుట్టపైకి మెట్టు మెట్టుకు బొట్లు పెట్టుకుంటూ వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- **చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు**
- **బత్తుల లక్ష్మీ ప్రసన్న నరసింహా గౌడ్ సర్పంచ్**




**చిట్యాల, విశాలభారతి:** మండలం గుండ్రాంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద హెల్ప్ ఏజ్ ఇండియా (ఎన్జీవో) ఆధ్వర్యంలో టెలి మెడిసిన్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరాన్ని మంగళవారం హెల్ప్ ఏజ్ ఇండియా చౌటుప్పల్ ప్రాజెక్టు హెల్త్ వర్కర్ బండారు నాగరాజుతో కలిసి గ్రామ సర్పంచ్ బత్తుల లక్ష్మీప్రసన్న నర్సింహ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం వల్ల అవి పెద్ద వ్యాధులుగా మారుతున్నాయని తెలిపారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, ముఖ్యంగా వృద్ధులు, పేద ప్రజలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ శిబిరంలో సుమారు 70 మంది గ్రామస్తులు వైద్య పరీక్షలు చేయించుకోగా, డాక్టర్ దివ్యశ్రీ బీపీ, డయాబెటిస్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ బొడ్డు అవినాష్, హెల్ప్ ఏజ్ ఇండియా వాలంటీర్ కుడికాల శ్రీనివాస్, వార్డు సభ్యుడు రత్నం నాగరాజు, నాయకులు బత్తుల నర్సింహ, కత్తుల లింగస్వామి, మిద్దెల రామలింగయ్య, రెడపాక యాదయ్య, దోర్నాల యాదయ్య, బొబ్బల లక్ష్మారెడ్డి, గాదరి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కు మంజూరు

**అందజేసిన చెంచల శ్రీనివాస్ గ్రామ శాఖ అధ్యక్షులు**

**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని తూప్రాన్ పేట్ గ్రామ కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులు వద్ది.అలివేలు శ్రీను కుమార్తె వద్ది చైతన్య కుటుంబంకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో 1000116/ లక్ష నూటపదహారు రూపాయల చెక్కు మంజూరు కావడం జరిగింది.ఈ సందర్భంగా ఆ కళ్యాణ లక్ష్మి చెక్కును చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయం వద్ద మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి సూచన మేరకు తూప్రాన్ పేట్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చెంచల శ్రీనివాస్ లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంధం ఆంజనేయులు,ముదంగుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



# కాబుల్‌లో మారణహోమం

- **ఆసుపత్రిపై వైమానిక దాడి.. 400 మంది మృతి**
- **250 మందికి పైగా రోగులు, సిబ్బందికి తీవ్ర గాయాలు**
- **దాడికి పాకిస్థానే కారణమన్న అఫ్ఘాన్ ప్రభుత్వం**
- **ఉగ్రవాద స్థావరాలనే లక్ష్యం చేసుకున్నామని వెల్లడి**
- **ఐరాస విచారణ జరపాలని డిమాండ్**
- **పౌర ప్రాంతాలపై దాడులు నిలిపివేయాలని ఐరాస విజ్ఞప్తి**



**విశాలభారతి, అంతర్జాతీయం:**

అఫ్గానిస్థాన్‌లోని ఇస్లామిక్ ఎమిరేట్ డిప్యూటీ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ వెల్లడించిన వివరాల ప్రకారం, కాబుల్‌లో 2వేల పడకల సామర్థ్యంతో నడుస్తున్న 'ఒమిద్ అడిక్షన్ ట్రీట్మెంట్' ఆసుపత్రిపై రాత్రి 9 గంటల సమయంలో ఒక్కసారిగా వైమానిక దాడులు జరిగాయి. ఈ దాడి తీవ్రతకు ఆసుపత్రి భవనంలోని ప్రధాన భాగం కుప్పకూలిపోయింది. దాడి జరిగిన వెంటనే భవనంలో భారీగా మంటలు చెలరేగడంతో లోపల ఉన్న రోగులు, వైద్య సిబ్బంది ప్రాణభయంతో అల్లాడిపోయారు. మంటలు వేగంగా వ్యాపించడం వల్ల సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. నిమిషాల వ్యవధిలోనే ఆసుపత్రి భవనం మంటల తుపానులో చిక్కుకుపోయింది. ఈ ఆసుపత్రి ముఖ్యంగా మాదకద్రవ్యాలకు బానిసలైన వారికి చికిత్స అందించి, వారిని సాధారణ జీవితంలోకి తీసుకువచ్చే ప్రత్యేక కేంద్రంగా పనిచేస్తోంది. దాడి సమయంలో ఆసుపత్రి రోగులతో కిక్కిరిసి ఉండటమే ఇంత పెద్ద మొత్తంలో ప్రాణనష్టం జరగడానికి ప్రధాన కారణమైంది. ఘటన జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగినప్పటికీ, అప్పటికే వందలాది మంది అగ్నికి ఆహుతయ్యారు. శిథిలాల కింద ఇంకా అనేకమంది చిక్కుకుపోయి ఉన్నారని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి ప్రాంగణమంతా రోగుల ఆర్తనాదాలు, మృతదేహాల కుప్పలతో భీతావహంగా మారింది.

ఈ ఘోరానికి పాకిస్థాన్ సైన్యమే కారణమని అఫ్గాన్ ప్రభుత్వం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. పొరుగు దేశం కావాలని పౌర సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడిందని ఆరోపించింది. అయితే, ఈ ఆరోపణలను పాకిస్థాన్ తీవ్రంగా తోసిపుచ్చింది. తాము పౌరులపై గానీ, ఆసుపత్రులపై గానీ దాడులు చేయలేదని స్పష్టం చేసింది. తూర్పు అఫ్గానిస్థాన్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, ఆయుధ నిల్వ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని మాత్రమే పరిమిత దాడులు నిర్వహించామని పాక్ సైన్యం ఓ ప్రకటనలో తెలిపింది. కానీ, ఆసుపత్రి కూలిన దృశ్యాలు మరియు రోగుల మృతదేహాలు పాక్ ఆరోపణలను ప్రశ్నిస్తున్నాయి. అఫ్గాన్ క్రికెట్ దిగ్గజం రషీద్ ఖాన్ ఈ ఘటనపై సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలు మరియు ఇళ్లపై దాడులు చేయడం ముమ్మాటికీ యుద్ధ నేరమేనని ఆయన మండిపడ్డారు. ఈ మారణహోమంపై ఐక్యరాజ్యసమితి మరియు అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు తక్షణమే స్పందించి నిష్పాక్షిక విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కష్టకాలంలో అఫ్గాన్ ప్రజలకు అండగా నిలవాలని ప్రపంచానికి విజ్ఞప్తి చేస్తూనే, తమ దేశ ప్రజలు ఈ బాధ నుంచి త్వరగా కోలుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. రషీద్ ఖాన్ చేసిన ట్వీట్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ప్రతినిధి రిచర్డ్ బెన్నెట్ కూడా ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పౌర ప్రాణనష్టం జరగడం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. ఆసుపత్రులు వంటి పౌర సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని ఆయన గుర్తు చేశారు. అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ రెండు దేశాలు గరిష్ట సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలను తగ్గించుకుని అంతర్జాతీయ నిబంధనలను గౌరవించాలని ఆయన పిలుపునిచ్చారు. మానవతా దృక్పథంతో రోగులకు చికిత్స అందించే చోట బాంబులు వేయడం ఆమోదయోగ్యం కాదని ఐరాస స్పష్టం చేసింది. అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు కూడా ఈ దాడిని ఏకగ్రీవంగా ఖండించాయి. ఆసుపత్రులపై దాడులు జరగడం మానవత్వానికే మచ్చ అని, యుద్ధాల్లో కూడా చికిత్స పొందే రోగులకు రక్షణ ఉండాలని డిమాండ్ చేశాయి. ఈ ఘటనపై స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు జరిపించి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని ప్రపంచ దేశాలను కోరాయి. అమాయక రోగులు బలైపోయిన ఈ ఘటన అఫ్గానిస్థాన్‌లో ఇప్పటికే నెలకొన్న మానవతా సంక్షోభాన్ని మరింత క్లిష్టతరం చేస్తోంది. మందులు, ఆక్సిజన్ అందక గాయపడిన వారు నరకయాతన అనుభవిస్తున్నారు.

ఈ వైమానిక దాడి అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలను కొత్త శిఖరాలకు చేర్చింది. సరిహద్దు గొడవలు, ఉగ్రవాద ఆరోపణల నేపథ్యంలో జరిగిన ఈ దాడిలో చివరకు బలయ్యింది మాత్రం సామాన్య ప్రజలే. మృతుల కుటుంబాల్లో తీరని శోకం నిండగా, గాయపడిన వారు సరైన వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రి ధ్వంసం కావడంతో ఇప్పటికే ఉన్న వైద్య సౌకర్యాల కొరత మరింత పెరిగే అవకాశం ఉంది. పొరుగు దేశాల మధ్య నెలకొన్న అపనమ్మకం ఇలా ప్రాణాల మీదకు రావడం విచారకరం. కాబుల్ ఆసుపత్రి ఘటన కేవలం ఒక భవనం కూలడం కాదు, వందలాది మంది పునర్జన్మపై జరిగిన దాడి. మాదకద్రవ్యాల నుంచి విముక్తి పొంది సమాజంలో గౌరవంగా బతకాలని ఆశించిన వారి కలలు శిథిలాల కింద సమాధి అయ్యాయి. ఈ విషాదం నుంచి అఫ్గాన్ సమాజం కోలుకోవడానికి చాలా కాలం పట్టవచ్చు. అంతర్జాతీయ సమాజం మౌనం వీడి, ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ముఖ్యంగా యుద్ధ సమయంలో కూడా పౌర ప్రాంతాలకు రక్షణ కల్పించాలనే నిబంధనలు ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

దాడుల నేపథ్యంలో అఫ్గాన్ ప్రజలు తీవ్ర భయాందోళనలో ఉన్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ బయట పడుతున్న మృతదేహాలు గుండెలను పిండేస్తున్నాయి. అఫ్గాన్‌పాక్ సరిహద్దుల్లో ఇప్పటికే అదనపు బలగాలను మోహరించడంతో యుద్ధ వాతావరణం కనిపిస్తోంది. శాంతి చర్చల ద్వారా పరిష్కరించుకోవాల్సిన సమస్యలను ఆయుధాలతో తేల్చాలని చూడటం వల్ల జరిగే వినాశనానికి ఈ కాబుల్ ఆసుపత్రి ఘటనే ఒక సజీవ సాక్ష్యం. అమాయక ప్రాణాల బలిపీఠంపై రాజకీయాలు చేయడం తగదని మేధావులు హెచ్చరిస్తున్నారు.

ప్రస్తుతం అఫ్గాన్ ప్రభుత్వం ఐరాస వేదికగా ఈ అంశాన్ని లేవనెత్తేందుకు సిద్ధమవుతోంది. పాకిస్థాన్‌పై కఠిన ఆంక్షలు విధించాలని కోరుతోంది. ప్రపంచ వేదికపై ఈ అంశం ఎంతటి ప్రాధాన్యత సంతరించుకుంటుందో చూడాలి. ఇదిలా ఉండగా, బాధితుల సహాయార్థం ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని స్థానిక అధికారులు కోరుతున్నారు. యుద్ధం ఏదైనా, గెలుపు ఎవరిదైనా, ఓడిపోయేది మాత్రం ఎప్పుడూ మానవత్వమే అని ఈ కాబుల్ ఉదంతం మరోసారి నిరూపించింది. ఈ దారుణ ఘటనపై అంతర్జాతీయ సమాజం నుండి మరింత ఒత్తిడి వస్తే తప్ప బాధ్యులు స్పందించేలా కనిపించడం లేదు. బాధితులకు న్యాయం జరగాలని, ఇలాంటి అమానవీయ దాడులకు చరమగీతం పాడాలని అఫ్గాన్ పౌరులు కోరుకుంటున్నారు. రాబోయే రోజుల్లో ఈ ఘటన రెండు దేశాల సంబంధాలను ఏ మలుపు తిప్పుతుందో వేచి చూడాలి.

## సానిటరీ నాప్కిన్లు అందించిన రోటరీ క్లబ్

**దేవరుప్పుల, విశాలభారతి :**



రోటరీ క్లబ్ హనుమకొండ వారి ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పాలకుర్తి బ్రాంచి సహకారంతో దేవరుప్పుల మండలంలోని పది ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థినులకు 410 ప్యాకెట్లు తిరిగి వాడుకోగలిగే సానిటరీ నాప్కిన్లను పంపిణీ చేయడం జరిగింది. కామారెడ్డి గూడెం లోని మండల విద్యా వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోటరీ క్లబ్ హన్మకొండ బ్రాంచి అధ్యక్షుడు బేతి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో బాలికలు ముఖ్యమైన భాగమని, వారి పీరియడ్స్ సమస్యలను అధిగమించి పాఠశాలకు రెగ్యులర్ గా హాజరు కావడానికి ఈ నాప్కిన్లు ఉపయోగపడతాయని భావించి అందజేస్తున్నామని తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాలకుర్తి బ్రాంచ్ మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండింగ్ క్రింద ఎస్ బి ఐ నుండి ఈ సామాజిక కార్యక్రమాలను చేపడుతున్నామని, పాఠశాలల్లో విద్యార్థుల ముఖ్య అవసరాలకు ప్రాముఖ్యతనిస్తున్నామని అన్నారు. కోఆర్డినేటర్ దారం శ్రీనివాస్ మాట్లాడుతూ, దేవరుప్పుల మండలంలోని పాఠశాలలకు మరికొన్ని వసతులు సమకూర్చడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎంఈఓ డా. జి. కళావతి మండల విద్యా శాఖ పక్షాన రోటరీ క్లబ్ వారికి మరియు ఎస్బిఐ కి ధన్యవాదాలు తెలియజేస్తూ, బాలికల అవసరాలకు ప్రాధాన్యతనివ్వడం అభినందనీయమని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జిసిఇసి బాలికా సాధికారతా క్లబ్బుల ద్వారా బాలికల ఆరోగ్యం, భద్రత, సౌకర్యాలు తదితర విషయాలపై బాలికలకు అవగాహన కలిగిస్తున్నారని, ఈ రీయూజబుల్ నాప్కిన్ల గురించి అవగాహనా కలిగించేలా చూస్తామని తెలియజేసారు. జడ్పిహెచ్ఎస్ ధర్మాపురం పాఠశాల గణిత ఉపాధ్యాయుడు, రోటరీ క్లబ్ సభ్యుడు తిరుపతి రెడ్డి ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసారు. క్లబ్ ప్రతినిధులు రాజిరెడ్డి, సురేందర్ రెడ్డి, జడ్పీహెచ్ఎస్ కోల్కొండ కాంప్లెక్స్ హెచ్ ఎం వెంకన్న, మరియు హైస్కూళ్ళ ఉపాధ్యాయులు ఎం. ప్రవీణ, ప్రణీత, శైలజ, అరుణ, రజితా కుమారి, రాధిక, పాండ్యా, శ్రీనివాస్ మరియు ఎంఈఆర్సి సిబ్బంది రవీందర్ రెడ్డి, నర్సింహులు, యాక స్వామి, మంజుల, రాంచందర్ పాల్గొన్నారు.

## తల గాయాలను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం

**న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ బోట్ల**

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

తలకు తగిలే గాయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదని, ప్రమాద సూచనలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ బోట్ల సూచించారు. మలక్‌పేట్ యశోద ఆసుపత్రి వైద్య బృందం అత్యవసర మెదడు శస్త్రచికిత్స ద్వారా తీవ్రమైన తల గాయం చెందిన 12 ఏళ్ల బాలుడి ప్రాణాలను కాపాడినట్లు తెలిపారు. ఈ విషయాన్ని శంషాబాద్ జోన్ కేంద్రంలోని ఎలైట్ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఒక పాఠశాలలో చదువుతున్న శంషాబాద్‌కు చెందిన బాలుడు కొన్ని రోజుల క్రితం మెట్లపై నుండి జారి పడిపోవడంతో తీవ్ర ట్రామాటిక్ బ్రెయిన్ ఇంజరీకి గురయ్యాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా, వైద్యులు సమయానికి న్యూరోసర్జికల్ జోక్యం మరియు ఆధునిక న్యూరో క్రిటికల్ కేర్ ద్వారా అతని ప్రాణాలను రక్షించారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, పెద్ద ఎపిడ్యూరల్ హీమరేజ్ మరియు తల ఎముక విరుగుడు వంటి గాయాలు మెదడులో ఒత్తిడి పెంచి, మెదడు నలిగే ప్రమాదం కలిగిస్తాయని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో తక్షణ నిర్ధారణ, అత్యవసర శస్త్రచికిత్స మరియు గాఢ పర్యవేక్షణ అత్యంత కీలకమని వివరించారు. బాలుడు ఆసుపత్రికి వచ్చినప్పుడు దాదాపు స్పృహ కోల్పోయే స్థితిలో ఉన్నాడు. ఎడమ పారియేటల్ ప్రాంతంలో వాపు, ఎడమ కంటిలో ఆర్బిటల్ హీమటోమా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. పై కంటి పాప పడిపోవడం, కంటి కదలికలు పరిమితంగా ఉండటం గమనించారు. తక్షణం సీటీ స్కాన్ చేయగా, ఎడమ టెంపరల్ ప్రాంతంలో 24 మిల్లీమీటర్ల మందంతో పెద్ద ఎపిడ్యూరల్ హీమరేజ్, టెంపరల్ ఎముక విరుగుడు, మెదడు మధ్యరేఖ 7 మిల్లీమీటర్ల మేర కుడివైపు మళ్లినట్లు బయటపడింది. పరీక్షల సమయంలోనే బాలుడు కోమాలోకి వెళ్లడంతో పరిస్థితి అత్యంత విషమంగా మారింది. వెంటనే వైద్యులు అత్యవసరంగా ఎడమ ఫ్రాంటోటెంపరోపారియేటల్ క్రానియోటమీ చేసి, ఎపిడ్యూరల్ హీమటోమాను తొలగించారు. రక్తస్రావం అవుతున్న రక్తనాళాలను సరిచేసి, రక్తస్రావాన్ని నియంత్రించారు. అనంతరం తల ఎముకను టైటానియం ప్లేట్లు, స్క్రూలతో తిరిగి అమర్చారు. ఈ శస్త్రచికిత్సను డాక్టర్ శ్రీనివాస్ బోట్ల, అనస్థీషియా బృందంతో కలిసి విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం బాలుడిని న్యూరో ఐసీయూలో ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచారు. వెంటిలేటర్ సహాయంతో చికిత్స అందించారు. మొదటి రోజుకే వెంటిలేటర్ తొలగించగా, బాలుడి న్యూరోలాజికల్ పరిస్థితి క్రమంగా మెరుగుపడింది. తలకు గాయమైతే స్పృహ కోల్పోవడం, తీవ్రమైన తలనొప్పి, వాంతులు, ప్రవర్తనలో మార్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని డాక్టర్ శ్రీనివాస్ సూచించారు.




## ఉచిత దుస్తుల పంపిణీ చేసిన సర్పంచ్



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం చిన్న మాడూర్ లోని అంగన్వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ మైదం జోగేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం చిన్నారులకు ఉచిత దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అంగన్వాడీ స్థాయి నుంచే పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు, మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, చిన్నారుల ఆరోగ్యాభివృద్ధి, విద్యాభ్యాసానికి అంగన్వాడీ కేంద్రాలు కీలక వేదికలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి క్రాంతి కుమార్, అంగన్వాడి టీచర్ ఎం హైమావతి, ఎం లలిత, ఏఎన్ఎం పద్మశ్రీ, ఆశ వర్కర్లు ఎం శోభ, ఎం జ్యోతి, ఆయాలు యాకలక్ష్మి, గీత తో పాటు విద్యార్థులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

**సమాజానికి ఆదర్శంగా భద్రమ్మ**



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి గ్రామంలో హృదయాన్ని తాకే సంఘటన చోటు చేసుకుంది గ్రామానికి చెందిన జటంగి కొమురయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయనకు ఇద్దరు కుమార్తెలు కుమారులు లేని నేపథ్యంలో పెద్ద కూతురు భద్రమ్మ తండ్రి అంత్యక్రియలను స్వయంగా నిర్వహించింది. సాంప్రదాయంగా కొడుకులు నిర్వహించే తలకొరివి కార్యక్రమాన్ని భద్రమ్మ ధైర్యంగా స్వీకరించి తండ్రికి తలకొరివి పెట్టి తన బాధ్యతలు నిర్వహించింది. ఆడైనా మగైనా ఒక్కటే అనే భావనను ఆచరణలో చూపిస్తూ గ్రామానికి ఆదర్శంగా నిలిచింది. ఈ ఘటనపై గ్రామస్తులంతా స్పందించి భద్రమ్మను అభినందించారు. సమాజంలో మారుతున్న విలువలకు ఇది నిదర్శనం అని కూతుర్లు కూడా తల్లిదండ్రులకు అండగా నిలుస్తారని, అభిప్రాయం తెలియజేస్తూ గ్రామంలోని పెద్దలు పార్టీల భేదం లేకుండా ఈ కార్యక్రమాన్ని ముందుండి అన్ని పార్టీల పెద్దలు గ్రామస్తులు మహిళలు యువకులు ముందుండి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## పంచాయతీ నిధులను ఫ్రీజింగ్ నుండి మినహాయించండి



**చౌటుప్పల్, విశాలభారతి:** గ్రామ పంచాయతీ నిధులు ప్రభుత్వ ట్రెజరీలో ఫ్రీజింగ్ నుండి మినహాయించాలంటూ చౌటుప్పల్ ఆర్డీవో కి వినతి పత్రం అందజేసిన చౌటుప్పల్ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు సుర్వి మల్లేష్ గౌడ్.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలు ఇంటిపన్నుల ద్వారా,ఇతర రుసుముల ద్వారా మరియు వివిధ రకాల అభివృద్ధి ఫలాలు వసూలు చేసిన డబ్బులు నేరుగా గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేయడం జరుగుతుంది.ఇట్టి డబ్బులు పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం గ్రామపంచాయతీ జనరల్ ఫండ్ నుండి గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాలు గాని త్రాగునీరు కొరకు మురికి కాలువల నిర్మాణాల కొరకు మరియు పారిశుద్ధ్యంలో భాగంగా చెత్త ట్రాక్టర్ల మెయింటినెన్స్ కొరకు అత్యవసర అవసరాల నిమిత్తం నిధులు డ్రా చేసుకొని ఖర్చు చేసే విధానం గతంలో ఉండేదని,కానీ ఇప్పుడు గ్రామ పంచాయతీల జనరల్ ఫండ్ కూడా ప్రభుత్వం ఫ్రీజింగ్ పేరుతో చేసి విధి నిర్వహణకు రావలసిన నిధులు డ్రా చేయకుండా చెక్కులను నిలిపివేయడం వలన అన్ని గ్రామాల సర్పంచులకు గ్రామ సమస్యలను పరిష్కరించలేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారు.కావున నూతనంగా ఎన్నికైన సర్పంచుల యందు దయదలచి గ్రామ పంచాయతీల అభివృద్ధి కొరకు ఫ్రీజింగ్ విధానాన్ని గ్రామ పంచాయతీ జనరల్ నిధులను మినహాయించాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరడమైనదని,ఈ సందర్భంగా ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

## స్వయం ఉపాధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

**చౌటుప్పల్, విశాలభారతి:** జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి సూచనలను మేరకు షెడ్యూలు కులముల సేవ సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ యాదాద్రి భువనగిరి జిల్లా వారి ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులముల కార్యాచరణ 202526 సంవత్సరానికి గాను అర్హులైన ఎస్సీకులాల అర్జిదారులకు సబ్సిడీపై విద్యుత్ ద్విచక్ర వాహనాలు,విద్యుత్ మూడు చక్రల వాహనాలు, సోలార్ యూనివర్సల్ పంప్ సెట్ మరియు వ్యవసాయ సంబంధిత పరికరములు ఇవ్వబడును కావున అర్జిదారుడు దరఖాస్తును https://tgobss.chg.gov.in ఆన్లైన్లో తేది: 17.03.2026 నుండి 24.03.2026 లోపల నమోదు చేసుకోవలెను ఓబిఎంఎంయస్ లో పూర్తిచేసిన దరఖాస్తులు అర్జీదారుడు డౌన్లోడ్ చేసుకొని మున్సిపల్ కార్యాలయం నందు అందజేయవలెను ఈ సందర్భంగా ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

# భర్త చేతిలో యూట్యూబర్ దారుణ హత్య

- గర్భిణి అని చూడకుండా భార్యపై భర్త కత్తితో కిరాతక దాడి
- యూట్యూబర్ వైష్ణవి మృతితో మాదాపూర్‌లో పెల్లుబికిన ఆగ్రహం
- ప్రేమ వివాహం చేసుకున్న రెండేళ్లకే నూరేళ్ల జీవితం బలి
- అత్తింటి వేధింపులే కారణమని బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు
- పరారీలో ఉన్న నిందితుడు హరిబాబు కోసం పోలీసుల గాలింపు
- గ్రామంలో ఉద్రిక్తత.. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ పహారా



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నవమాసాలు మోసి, కొత్త జీవానికి ప్రాణం పోయాల్సిన ఒక తల్లి.. కన్న బిడ్డతో సహా కాలగర్భంలో కలిసిపోయింది. ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తాడని నమ్మి చేయి పట్టిన వాడే కాలయముడిగా మారి గొంతు కోశాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని మాదాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్న ఈ అమానుష ఘటన స్థానికంగా పెను సంచలనం సృష్టించింది. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ, అందరినీ నవ్విస్తూ యూట్యూబర్‌గా గుర్తింపు పొందిన వైష్ణవి, తన భర్త చేతిలోనే బలైన తీరు ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోంది. డిజిటల్ ప్రపంచంలో ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్న ఒక ప్రతిభావంతురాలు, నిజ జీవితంలో ఇంతటి దారుణమైన ముగింపును ఎదుర్కోవాల్సి వస్తుందని ఎవరూ ఊహించలేదు. వివరాల్లోకి వెళితే.. సుమారు రెండేళ్ల క్రితం వైష్ణవి, చిత్తారి హరిబాబు అనే యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. పెద్దలను ఎదిరించి, తమ ప్రేమే లోకమని భావించిన ఈ జంట తొలినాళ్లలో ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. కానీ కాలక్రమేణా ఆ ప్రేమ కాస్తా అనుమానంగా, నిత్య గొడవలకు దారితీసింది. గత కొంతకాలంగా వీరిద్దరి మధ్య చిన్నపాటి మనస్పర్థలు మొదలయ్యాయని, అవి రోజురోజుకూ ముదిరి వివాదాలకు దారితీస్తున్నాయని గ్రామస్థులు చెప్పుకుంటున్నారు. నిత్యం ఏదో ఒక కారణంతో గొడవలు జరగడం పరిపాటిగా మారింది. ఒకప్పుడు సోషల్ మీడియాలో తమ ప్రేమను చాటుకున్న ఈ జంట మధ్య ఇంతటి విద్వేషం ఎలా పెరిగిందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం వైష్ణవి గర్భవతి కావడంతో ఆ ఇంట్లో కొత్త వెలుగులు వస్తాయని, మనస్పర్థలు తొలగిపోతాయని అంతా భావించారు. కానీ సోమవారం రాత్రి దంపతుల మధ్య మొదలైన సామాన్య తగాదా ఒక్కసారిగా హింసాత్మక రూపం దాల్చింది. మాట మాట పెరగడంతో ఆవేశానికి లోనైన హరిబాబు, కనీసం తన కడుపులో పెరుగుతున్న బిడ్డ గురించి కూడా ఆలోచించకుండా విచక్షణ కోల్పోయాడు. కోపంతో ఊగిపోతూ ఇంట్లోని కత్తితో వైష్ణవిపై దాడికి దిగాడు. ఆమెను చిత్రహింసలకు గురిచేస్తూ శరీరమంతా గాయపరిచాడని సమాచారం. ఒక గర్భిణి ఆర్తనాదాలు ఆ కిరాతకుడి మనసును కరిగించలేకపోయాయి. ఆ కిరాతకుడు చేసిన విచక్షణ రహిత దాడిలో తీవ్ర రక్తస్రావమై వైష్ణవి అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. గర్భిణి అని కూడా చూడకుండా కడుపులో ఉన్న బిడ్డతో సహా ఆమె ప్రాణాలు పోయేలా క్రూరంగా ప్రవర్తించాడు. రక్తపు మడుగులో పడి ఉన్న భార్యను చూసి చలించకపోగా, ఆ నిందితుడు ఏమాత్రం పశ్చాత్తాపం లేకుండా అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని గమనించగా, అప్పటికే వైష్ణవి నిర్జీవంగా పడి ఉంది. ఆ దృశ్యం చూసిన పోలీసులే విస్తుపోయారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఈ దారుణ హత్య వెనుక కేవలం భర్తే కాకుండా అత్తింటి వారి ప్రమేయం కూడా ఉందని బాధితురాలి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. తమ కుమార్తెను పెళ్లి చేసుకున్నప్పటి నుంచి హరిబాబుతో పాటు అతని తల్లిదండ్రులు కూడా నిరంతరం వేధిస్తూనే ఉన్నారని వారు ఆరోపిస్తున్నారు. ఇది ఏదో క్షణికావేశంలో జరిగిన గొడవ కాదని, పక్కా పథకం ప్రకారమే తన బిడ్డను హరిబాబు అంతం చేశాడని వాపోతున్నారు. అదనపు కట్నం కోసమో లేక ఇతర ఆధిపత్య పోరు వల్లో వేధించి చివరకు ప్రాణాలు తీశారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక ఆడబిడ్డను అత్తగారింటికి పంపితే, అది ఆమెకు శ్మశానంగా మారుతుందని ఊహించలేదని వారు రోదిస్తున్నారు.

పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్ మార్టం నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో మాదాపూర్ గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైష్ణవి బంధువులు, గ్రామస్థులు నిందితుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడికి ఉరిశిక్ష పడే వరకు తాము విశ్రమించబోమని, చట్టం తన పని తాను చేయకపోతే తామే న్యాయం చేసుకుంటామంటూ హెచ్చరించారు. ఆగ్రహంతో ఉన్న గ్రామస్థులు నిందితుడి ఇంటిపై దాడి చేసే అవకాశం ఉండటంతో, పోలీసులు గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా మోహరించారు. నిందితుడు హరిబాబు ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. సాంకేతిక ఆధారాల సాయంతో, అతని మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న వాడే ఇంతటి ఘాతుకానికి పాల్పడటం వెనుక బలమైన కారణాలు ఏమైనా ఉన్నాయా లేక కేవలం అహంకారమే ప్రాణాలు తీసిందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. వైష్ణవికి సంబంధించిన యూట్యూబ్ చానల్ వివరాలు, సోషల్ మీడియాలో ఆమె పెట్టిన పోస్టులను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. సోషల్ మీడియాలో 'వైష్ణవి యూట్యూబర్' అనగానే ఆమె కంటెంట్ ఇష్టపడే వారు చాలా మంది ఉన్నారు. తన ప్రతిభతో ఎంతోమంది ఫాలోవర్లను సంపాదించుకున్న ఆమె, నిజ జీవితంలో ఇంతటి విషాదాన్ని ఎదుర్కొంటుందని ఫాలోవర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమె చేసిన చివరి వీడియోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతుండగా, ఆమెకు న్యాయం జరగాలంటూ 'జస్టిస్ ఫర్ వైష్ణవి' అనే హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతున్నాయి. ఒక గర్భిణి ప్రాణాలను బలిగొన్న నిందితుడిని కఠినంగా శిక్షించాలనే డిమాండ్ సోషల్ మీడియా వేదికగా మిన్నంటుతోంది. మరోవైపు, నిందితుడి కుటుంబ సభ్యులు కూడా ఈ ఘటన తర్వాత గ్రామం విడిచి వెళ్లినట్లు తెలుస్తోంది. పోలీసులు వారిని కూడా విచారించే పనిలో పడ్డారు. గృహ హింస పెచ్చుమీరడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, గర్భిణులపై దాడులు జరగడం సమాజానికి సిగ్గుచేటని మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. పెళ్లయిన రెండేళ్లకే ఒక నిండు ప్రాణం, పుట్టని బిడ్డ ప్రాణం ఇలా గాలిలో కలిసిపోవడం ఆ కుటుంబంలో తీరని లోటును మిగిల్చింది. ఈ ఘటన మన వ్యవస్థలో లోపాలను, ప్రేమ పేరుతో జరుగుతున్న క్రూరత్వాలను ఎత్తిచూపుతోంది. ప్రస్తుతం కోరుట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు. ఫోరెన్సిక్ బృందాలు కూడా ఘటన స్థలంలో కీలక ఆధారాలను సేకరించాయి. ఈ కిరాతక చర్యకు పాల్పడిన హరిబాబు దొరికితేనే అసలు నిజాలు బయటకు వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఆవేశం మనిషిని ఎంతటి దారుణానికైనా ఒడిగట్టేలా చేస్తుందని, కానీ కన్న బిడ్డను కూడా చూడకుండా చేసిన ఈ హత్య నాగరిక సమాజంలో తలవంపులు తెచ్చే చర్య అని మేధావులు అభిప్రాయపడుతున్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడటమే మృతురాలికి ఇచ్చే అసలైన నివాళి అని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు.

## బిజెపి వైఫల్యం వల్లనే గ్యాస్ కొరత

**నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు**



**కురవి విశాలభారతి:** బిజెపి ప్రభుత్వ విధాన వైఫల్యాల వల్ల గ్యాస్ ధరలు పెరిగి తీవ్ర కొరత ఏర్పడ్డదని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి ఆరోపించారు. కురవి మండల కేంద్రం గుడి సెంటర్ లో వంట గ్యాస్ మొద్దు పెట్టి ధరల పెరుగుదలపై ధర్నా నిర్వహించి ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నియంతగా వ్యవహరిస్తూ తన ఆధిపత్యాన్ని చలాయించడం కోసం ప్రభుత్వ అధినేతలను ఎత్తుకెళ్లి నిర్బంధించడం, ఇరాన్ పై ఇజ్రాయిల్ తో కలిసి ఏకపక్షంగా దాడులు నిర్వహించి ప్రపంచ సంక్షోభానికి కారణమవుతున్నా, నరేంద్ర మోడీ అమెరికాను పల్లెత్తు మాట అనకుండా, ఎవరి వద్ద చమరు కొనాలో ట్రంప్ పర్మిషన్ తీసుకోవలసిన రావడం అమెరికాకు దాసోహమై, దేశ సార్వభౌమత్వాన్ని మంటగలిపారని, గ్యాస్ ధర ఒకేసారి 60 రూపాయలు పెంచడం, గ్యాస్ బండల తీవ్ర కొరత తో హోటల్స్ హాస్టల్స్ మూతపడే పరిస్థితి ఏర్పడి ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాదిమంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ముందస్తు ప్రణాళికలు లేకుండా వ్యవహరిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ బాధ్యతారహితమైన విధానాలేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు. నాగేశ్వరరావు కొరవి టౌన్ కార్యదర్శి తురక రమేష్, బుడమ వెంకన్న, దూదికట్ల సారయ్యా, కలగూర నాగరాజు, బొల్లం విజయ్ ,యం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సామ్‌సంగ్ మొబైల్ పేరుతో మోసం




**రాజేంద్రనగర్, విశాలభారతి :** శంషాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది, రాజేంద్రనగర్ పోలీసులతో కలిసి అమాయకులను మోసం చేస్తున్న నిందితులను పట్టుకున్నారు. సామ్‌సంగ్ మొబైల్ ఫోన్లు అమ్ముతున్నామని చెప్పి, వాటి స్థానంలో పోస్టల్ పార్సల్ ద్వారా స్పీకర్లు, టంబ్లర్లు వంటి వస్తువులు పంపిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. 2021 సంవత్సరం నుండి ఈ మోసాలకు పాల్పడి, అమాయకుల నుండి భారీ మొత్తంలో డబ్బు దోచుకున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల పేర్లు.. ఎస్. విజయ్ కుమార్, వయస్సు 33 సంవత్సరాలు, వృత్తి: ఆన్‌లైన్ వ్యాపారం, నివాసం: బెంగళూరు. వై. శివ కుమార్, వయస్సు 31 సంవత్సరాలు, వృత్తి: ఆన్‌లైన్ వ్యాపారం, నివాసం: కాటేదాన్, హైదరాబాద్, స్వస్థలం: కర్ణాటక రాష్ట్రం. ముద్దిన్, వయస్సు 32 సంవత్సరాలు, వృత్తి: ఆఫీస్ బాయ్, నివాసం: భావాని నగర్, స్వస్థలం: బీదర్, కర్ణాటక రాష్ట్రం. శశికాంత్, వయస్సు 22 సంవత్సరాలు, వృత్తి: ఆఫీస్ బాయ్, నివాసం: హైదర్‌గూడ, స్వస్థలం: బీదర్, కర్ణాటక రాష్ట్రం. మంజుల, నివాసం: బెంగళూరు (పరారీలో ఉంది) సమాచారం ఆధారంగా, శంషాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ మరియు రాజేంద్రనగర్ పోలీసులు కలిసి నిందితులను పట్టుకొని పై వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను మరియు స్వాధీనం చేసిన వస్తువులను రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ అరెస్టులు శ్రీ కె. వెంకట్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, టాస్క్ ఫోర్స్, శంషాబాద్ జోన్ ఆధ్వర్యంలో జరిగాయి.

## పారిశుద్ధ కార్మికులకు సన్మానం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్మెట్ మండలం చిన్న రావిరాల గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ కార్మికులు, గ్రామ సిబ్బందికి సన్మానం చేసి, పారిశుద్ధ సామగ్రిని పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ హాజరై మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిలో పారిశుద్ధ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వారి సేవలు ప్రశంసనీయమని అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సద్ది పల్లి శిరీష శంకర్ రెడ్డి, గ్రామ సెక్రెటరీ సునీత, వార్డు సభ్యులు బండారి అనిత, ఆకిటి రామకృష్ణారెడ్డి, నారెడ్డి రిషిత, సతీష్ రెడ్డి, రాపోలు మల్లేష్, బండారి సత్యనారాయణ, చెరుకు భాగ్యమ్మతో పాటు డ్వాక్రా సంఘాల అధ్యక్షురాలు కొమురెల్లి రేణుక తదితరులు పాల్గొన్నారు.

## పలు సమస్యలపై కెఎల్ఆర్‌ని కలిసిన పున్న గణేష్ నేత



**ఎల్బీనగర్, విశాలభారతి :** రామకృష్ణాపురం డివిజన్లో పలు కాలనీల అభివృద్ధి విషయములో మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ శాసనసభ్యులు కిచ్చన్న లక్ష్మారెడ్డికి కలిసిన రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావ్, డివిజన్లో ఉన్న సమస్యలు వివరించడం జరిగింది. అందుకు కేఎల్ఆర్ సానుకూలంగా స్పందించి సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని పున్న గణేష్ నేత తెలిపారు.

## ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిన సూర్య ఉదయం ఎడిటర్ భాషా



**కూకట్ పల్లి, విశాలభారతి:** కూకట్పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి కాలనీ ఫోర్త్ ఫేస్ మస్జిద్ లో సూర్య ఉదయం తెలుగు దినపత్రిక తెలంగాణ ఎడిటర్ వారి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగినది. భాష మాట్లాడుతూ ఈ రంజాన్ మాసంలో పదిమందికి భోజనం రూపంలో అలాగే ఎటువంటి దానాలైనా చేస్తే ఆ అల్లా వారికి మంచి ఆరోగ్యమైన మంచి సంపాదన ఎల్లప్పుడూ అలా దీవెనలు ఉంటాయని తెలియజేశారు. ఈ సందర్భంగా మజీద్ కి విచ్చేసిన సుమారు 300 మందికి విందు ఏర్పాటు చేసి ఆ తర్వాత ప్రత్యేక ప్రార్థనలు చేసుకుని ఆ అల్లా ఆశీర్వాదం తీసుకున్నారు ఈ కార్యక్రమంలో మీడియా మిత్రులు అలాగే బంధు స్నేహితులు మసీద్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


## పోలీస్ డ్యూటీ మీట్‌లో సత్తా చాటిన కానిస్టేబుల్ అశోక్



**సీపీ, డీసీపీ చేతుల మీదుగా పురస్కారం**

**కూకట్ పల్లి, విశాలభారతి:** ఇటీవల నిర్వహించిన సైబరాబాద్ పోలీస్ డ్యూటీ మీట్లో బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ అశోక్ అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల్లో తన నైపుణ్యాన్ని చాటుకుని తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ డా. రమేష్ రెడ్డి, కానిస్టేబుల్ అశోక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఆయన ప్రతిభను కొనియాడుతూ నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ ముత్యం రెడ్డి, సీటీసీ ఏసీపీ గంగారాం తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాలానగర్ సీఐ నర్సింహా రాజుతో కలిసి కానిస్టేబుల్ అశోక్, బాలానగర్ జోన్ డీసీపీ రితి రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీపీ నగదు పురస్కారం అందించి కీలక సూచనలు చేశారు.. పోలీసులు ఎప్పటికప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా తమ వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి. విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయి. నేర పరిశోధనలో ప్రతిభ చూపిన వారిని గుర్తించి గౌరవించడం వల్ల, తోటి సిబ్బందిలో కూడా ఉత్సాహం పెరుగుతుందని డిసిపి అభిప్రాయపడ్డారు.

## ప్రైవేట్ మినీ బస్సు బోల్తా : పది మందికి గాయాలు



**శేరిలింగంపల్లి, విశాలభారతి:** మినీ బస్సు బోల్తాపడిన ఘటనలో పది మంది ఉద్యోగులకు గాయాలైన ఘటన హైదరాబాద్ మియాపూర్‌లో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం.. 'లీ ఫార్మా' సంస్థకు చెందిన ఈ మినీ బస్సు, పది మంది ఉద్యోగులను తీసుకుని కేపీహెచ్‌బీ నుండి గడ్డపోతారం పారిశ్రామిక ప్రాంతంలోని కంపెనీ యూనిట్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది.ఈ ఘటనలో బస్సులోని పది మంది ఉద్యోగులకు గాయాలయ్యాయి.వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారందరినీ చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.అదృష్టవశాత్తూ ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అతి వేగం లేదా సాంకేతిక లోపం కారణంగానే బస్సు అదుపు తప్పి బోల్తా పడి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన కళ్లెం నవజీవన్ రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఎల్ బి నగర్ నియోజకవర్గం హయత్ నగర్ డివిజన్ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన పదవీకాలంలో మంజూరైన నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు కాలనీవాసులకు ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా, వర్షాకాలానికి ముందుగానే రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను సమర్థవంతంగా మెరుగుపరచాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, కాలనీ అధ్యక్షుడు యాదగిరి యాదవ్‌తో పాటు స్థానిక కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## పంతంగి టోల్‌గేట్ వద్ద భారీ గంజాయి స్వాధీనం




**అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్**

**చౌటుప్పల్, విశాలభారతి:**

మండలంలోని పంతంగి టోల్‌గేట్ వద్ద ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన తనిఖీలలో భారీగా ఎండు గంజాయి పట్టుబడింది. మంగళవారం జరిగిన ఈ ఆపరేషన్‌లో సుమారు 60.685 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నలుగురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎ. శ్రీనివాస్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎం. విష్ణుమూర్తి ఆదేశాల మేరకు రామన్నపేట, మోత్కూర్ స్టేషన్ల అధికారులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన ఒక ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో భారీ మొత్తంలో గంజాయి బయటపడింది. అరెస్టైన నిందితులు మహారాష్ట్రకు చెందిన గంగా బాయ్ పాండు రంగ్ చౌహన్, కమల్ అర్జున్ మోహితే, విజయ్ ఆసారం గోరపడే మరియు నల్గొండకు చెందిన వల్లపు దాసు వేణుకుమార్‌గా గుర్తించారు. వీరు భరంపూర్ నుంచి గంజాయిని తరలించి, హైదరాబాద్ మీదుగా మహారాష్ట్ర కు తరలించే ప్రయత్నంలో పట్టుబడ్డారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.25 లక్షలు ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. గంజాయి తో పాటు ఒక ఆటో, రెండు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకుని, నిందితులను రామన్నపేట ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు.ఈ ఆపరేషన్‌లో ఎస్ఐలు, కానిస్టేబుళ్లు కలిసి పాల్గొని సమన్వయంతో తనిఖీలు నిర్వహించడం ద్వారా ఈ అక్రమ రవాణాను అడ్డుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.

# ఆక్రమణలపై హైడ్రా భారీ ఆపరేషన్






**రూ.1650 కోట్ల ప్రభుత్వ భూమిని కాపాడిన అధికారులు**

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

హైదరాబాద్ నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రజావసరాలకు ఉద్దేశించిన 11 ఎకరాల భూమిని హైడ్రా కాపాడింది. మార్కెట్లో వీటి విలువ రూ. 1650 కోట్లు ఉంటుందని అంచనా.ఇందులో 2 ఎకరాలు పార్కు కోసం కేటాయించినది కాగా.., 5 ఎకరాలు స్మశాన వాటికతో పాటు 4 ఎకరాల డంప్ యార్డుకు చెందినది ఉంది.హైడ్రా విడుదల చేసిన ప్రకటనలోని వివరాల ప్రకారం...రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ విలేజ్లోని సెంట్రల్ పార్కు కాలనీలో పార్కు కోసం 2 ఎకరాలు కేటాయించారు. సర్వే నంబరు 110/1 లో 148 ప్లాట్లతో 16 ఎకరాల మేర సెంట్రల్ పార్కు కాలనీ ఫేజ్ 1 పేరుతో 1998లో లే ఔట్ వేశారు. ఇందులో 2 ఎకరాలను పార్కు కోసం కేటాయించగా.. మున్సిపల్ అధికారులు పార్కు స్థలంగా హద్దులు నిర్ధారించి ప్రహరీ కూడా నిర్మించారు. ఇలా పార్కు కోసం కేటాయించిన భూమి తమదంటూ కొంతమంది ఆక్రమణలకు పాల్పడడం.. కాలనీవాళ్లు అడ్డుకుంటే వారిని బెదిరించడం వంటి ఘటనలు పలుమార్లు జరిగాయి.హైడ్రా ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, జీహెచ్ ఎంసీ అధికారులతో కలసి హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. 2 ఎకరాల పార్కు స్థలంగా నిర్ధారించింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం పార్కులో తాత్కలికంగా వేసిన షెడ్డులను తొలగించింది. 2 ఎకరాల పార్కు స్థలం చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది.

**ప్రగతినగర్ లో 9 ఎకరాలు**

ప్రగతినగర్‌లోని అంబీర్ చెరువుకు ఆనుకుని ఉన్న 5 ఎకరాల స్మశానవాటికతో పాటు.. ఆ పక్కనే ఉన్న 4 ఎకరాల డంపింగ్ యార్డు ఆక్రమణలకు గురవుతున్నాయనే ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో హైడ్రా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. రెవెన్యూ, జీహెచ్ ఎంసీ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో విచారించింది. కూకట్‌పల్లి మండలంలోని బాగామేరి విలేజ్ సర్వే నంబరు 103లో ఉన్న ఈ భూమిని స్మశానవాటికకు, చెత్త డంపింగ్ యార్డుకు కేటాయించిందిగా నిర్ధారించుకున్నారు.హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు 9 ఎకరాల భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. 5 ఎకరాలలో స్మశాన వాటిక స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. ఆ పక్కనే ఉన్న 4 ఎకరాల్లో ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు.



# సెట్‌లోనే ఉస్తాద్ భగత్ సింగ్ భామ శ్రీలీల ప్రిపరేషన్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తోన్న మూవీ ఉస్తాద్ భగత్ సింగ్ హరీష్ శంకర్ ఈ మూవీలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా.. రాశీఖన్నా కీ రోల్ పోషిస్తోంది. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఉస్తాద్ భగత్ సింగ్ మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. ప్రమోషన్స్‌లో భాగంగా ఇంటర్వ్యూల్లో పాల్గొంటుంది శ్రీలీల. రాశీ ఖన్నా ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాన్ని స్క్రిప్ట్ వినకుండానే ఒప్పుకుందని ఇప్పటికే హరీష్ శంకర్‌తోపాటు రాశీఖన్నా కూడా పలు సందర్భాల్లో చెప్పిందని తెలిసిందే. ఇలాంటి విషయాన్నే ఒకటి శ్రీలీల షేర్ చేసుకుంది. అయితే ఇది కథ గురించి మాత్రం కాదు. తన షూటింగ్ ఎక్స్‌పీరియన్స్ గురించి చెప్పింది శ్రీలీల. హరీష్ శంకర్ తాను ప్రిపేర్ కావడానికి ఎప్పుడూ తనకు షూటింగ్‌కు ముందు కానీ లేదా షూటింగ్ కంటే ముందు రోజు కానీ ఏ స్క్రిప్ట్ లేదా మెటీరియల్‌ను ఇవ్వలేదని చెప్పింది. నేను సెట్‌లోనే షూట్ కోసం ప్రిపేర్ అయ్యాయని చెప్పింది. మొత్తానికి లొకేషన్‌లోనే షూట్ ప్రిపేర్ అయి ఎంత ప్రొఫెషనల్ కమిట్ మెంట్ ఉందో చెప్పకనే చెబుతోంది శ్రీలీల. ఉస్తాద్ భగత్ సింగ్ మూవీలో పార్థీబన్ విలన్‌గా నటిస్తుండగా.. గౌతమి, కేఎస్ రవికుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీకి దేవీ శ్రీ ప్రసాద్ పాటలు కంపోజ్ చేస్తుండగా.. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వర్క్ ఎస్ థమన్ చేస్తున్నాడు. ఇప్పటికే విడుదల చేసిన సాంగ్స్ నెట్టింట దుమ్ములేపుతున్నాయి.

# సురక్షితమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలి

- వంటకారులకు ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమం
- డిఎం హెచ్ ఓ తుకారాం రాథోడ్





**కొత్తగూడెం ప్రతినిధి, విశాలభారతి:** ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన ఆహారం అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని డిఎమ్హెచ్ఓ తుకారాం రాథోడ్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణాలపై వీధి ఆహార విక్రేతలు, రెస్టారెంట్ యజమానులు, వంటకారులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం పాల్వంచలోని డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆహార భద్రత, పరిశుభ్రత పాటించడం ప్రజారోగ్య పరిరక్షణలో ఎంతో ముఖ్యమని తెలిపారు. ఆహార పదార్థాలను శుభ్రంగా తయారు చేయడం, వంట ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం, తాగునీటిని శుద్ధిగా వినియోగించడం, ఆహార పదార్థాలను సరైన విధంగా నిల్వ చేయడం, ఆహార తయారీలో పాల్గొనే వారి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి శరత్, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ , హైజీన్ ట్రైనర్ నందిని పాల్గొని ఆహార భద్రతా ప్రమాణాలు, పరిశుభ్రత చర్యలు మరియు ఆహార కలుషితాన్ని నివారించే విధానాలపై వివరంగా శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని రెస్టారెంట్ యజమానులు, వంటకారులు, వీధి ఆహార విక్రేతలు పాల్గొని శిక్షణ పొందారు.

# ముస్లీంల స్మశాన వాటికలో పందులను నిర్మూలించాలి

- జిల్లా కలెక్టర్, మేయర్‌లకు ఫిర్యాదు
- మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. యాకూబ్ పాషా



**పాల్వంచ విశాలభారతి:** పాల్వంచ పట్టణంలోని నటరాజ్ సెంటర్‌లో ఉన్న ముస్లింల స్మశాన వాటికలో పందుల సంచారం పెరిగిపోవడంతో పాటు అక్కడే పందులను కాల్చడం, కోయడం మరియు పంది మాంసం విక్రయించడం జరుగుతుండటంపై మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. యాకూబ్ పాషా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై మంగళవారం జిల్లా కలెక్టర్ మరియు మేయర్‌లకు ఫిర్యాదు చేశారు. సుమారు 75 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ స్మశాన వాటికలో ముస్లింల పూర్వీకుల సమాధులు ఉన్నాయని, ప్రతి శుక్రవారం అలాగే రంజాన్, బక్రీద్ వంటి పవిత్ర పండుగల సమయంలో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి పుష్పాంజలి ఘటించి ప్రార్థనలు చేయడం ఆనవాయితీగా కొనసాగుతుందని తెలిపారు. అయితే కొంతమంది పందుల పెంపకదారులు తమ వ్యాపారానికి ఈ స్మశాన వాటికను అడ్డాగా మార్చుకోవడంతో ముస్లింల మనోభావాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని అన్నారు. గతంలో అధికారులు స్మశాన వాటిక చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించినప్పటికీ, కొంతమంది దానిని తొలగించి పవిత్ర స్థలాన్ని అపవిత్రం చేస్తూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఈ నెల 21న పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు జరుగనున్న నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి పందుల పెంపకందారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, స్మశాన వాటికను రక్షించే చర్యలు చేపట్టి ముస్లింల మనోభావాలను కాపాడాలని జిల్లా కలెక్టర్ మరియు మేయర్‌లను కోరారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేసిన బిజెపి శ్రేణులు



**దేవరుప్పుల, విశాలభారతి:** మండల బీజేపీ అధ్యక్షుడు బస్వ భాస్కర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ కు వినతి పత్రాన్ని అందజేసిన బీజేపీ శ్రేణులు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాలుగా యువతకు నిరుద్యోగ భృతి కల్పిస్తామని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అర్హులైన యువత కు నిరుద్యోగ భృతి కల్పిస్తూ ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించాలని,దీనికోసం వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేసి ఖాళీగా ఉన్నా ఉద్యోగాలను భర్తీ చెయ్యాలని,అలాగే వృద్దులకు, వితంతువులకు, వికలాంగులకు కొత్త పెన్సషన్లు వెంటనే చెల్లించాలని, స్థానికంగా నిర్లక్ష్యానికి గురైన 100 పడకల హాస్పిటల్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మొన్నటి వరకు మున్సిపాలిటీ ఎన్నికలలో హామీల వర్షం కురిపించి గద్దెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తాను స్థానికంగా చేస్తానని ఇచ్చిన హామీలను స్థానిక మున్సిపాలిటీలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన గోపాల గిరి రోడ్డుకు ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన నిరుపేదలకు అందించాలని,స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారిని కూడా డిమాండ్ చేయడం జరుగుతుందని, పేరుకపోయిన ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా గుంటి అజయ్, మండల గిరిజన మోర్చా అన్వేష్, సీతారాంపురం గ్రామ బూత్ అధ్యాక్షులు తిమ్మాపురం అనిల్, వార్డు సభ్యుడు బస్వ మహేందర్, బాషిపాక సుధాకర్, పడమటింటి దుర్గరాజు, కూరాకుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశ కార్మికులతో దద్దరిల్లిన కలెక్టరేట్

- హామీలు అమలుకు పట్టు
- స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కరిస్తానని డీఎంహెచ్ఓ హామీ
- హామీలు అమలు చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తాం
- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ హెచ్చరిక

**నిజామాబాద్, విశాలభారతి:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలసమయంలో ఆశాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తమ సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కదం తొక్కారు. బైపాస్‌చౌరస్తా నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. హామీల అమలు కోసం నినదించారు. పోలీసులు ఆశా వర్కర్లను కలెక్టరేట్ గేట్ వద్ద అడ్డుకున్నారు.దీంతో అక్కడే ధర్నా చేపట్టారు. అధికారులు వచ్చిహామీ ఇచ్చే వరకు కదలబోమని భీష్మించారు. దీంతో డీఎంహెచ్ఓ వచ్చి కార్మికుల సమస్యల పరిష్కారానికి హామీనిచ్చారు. రూ.18 వేల వేతనంపై రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తామని, స్థానికసమస్యల పరిష్కారినాకి వైద్యాధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. అంతకముందు ధర్నానుద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నుర్జహాన్ మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఆశా కార్యకర్తలకు అనేక రకాల హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రెండు సంవత్సరాలు దాటుతున్న సమస్యలు పరిష్కరించకుండా అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ పథకం కింద పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు సరియైన పారితోషకాలు చెల్లించకుండా వారితోవెట్టి చాకిరి చేయిస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వస్తే ఫిక్స్డ్ వేతనం అమలు చేస్తామని ఎవరు కూడా రోడ్డు ఎక్కి ధర్నా చేయవలసిన అవసరం లేదని చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల గడుస్తున్న ఇప్పటివరకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని అన్నారు. ప్రతినెల 5వ తేదీ లోపు పారితోషకాలు చెల్లిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం 3 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని వాపోయారు. పారితోషకాలు అడిగితే ఆశాలను అరెస్టు చేసి స్టేషన్లకు తరలిస్తున్నారని ఆమె మండిపడ్డారు. పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ లో ఆశాలకు ఫిక్స్డ్ వేతనం అమలు చేసి గ్రాట్యూటీతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు అమలు చేస్తున్నప్పుడు.. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ నూతన ప్రభుత్వం ఎందుకు అమలు చేయదని నిలదీశారు. ఇప్పటికైనా ఆశలకు పెండింగ్ లో ఉన్న పారితోషకాలు వెంటనే చెల్లించాలని, ఫిక్స్డ్ వేతనం 18000 అమలు చేయాలని లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తామని ఆమె ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా నాయకులు సుకన్య, సిహెచ్ నర్స, విజయ, స్వప్న, , ఇందిరా, భూలక్ష్మి, దివ్య , లావణ్య, బాలమణి, నీలోఫర్, లత, సబిత తనుజ, లలిత, విజయ, తదితరులు పాల్గొన్నారు.





Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.